


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

## గ్రేటర్ హైదరాబాద్

శుక్రవారం 22 ఆగస్టు 2025 పేజీలు 9


### మాదాపూర్‌లోని జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో

# భారీ కూల్చివేతలు

- రూ.400 కోట్ల విలువైన 16,000 చదరపు గజాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా హైడ్రా చర్యలు
- కబ్జాదారులపై పోలీస్ కేసులు నమోదు చేస్తామని వెల్లడి




మాదాపూర్,మేజర్ న్యూస్ : హైదరాబాద్, మాదాపూర్‌లో ప్రభుత్వ భూములపై కన్నేసిన కబ్జాదారులకు హైడ్రా గట్టి షాక్ ఇచ్చింది. భారీ ఆపరేషన్ చేపట్టి, సుమారు రూ.400 కోట్ల విలువైన అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంది. శేరిలింగంపల్లి మండలం పరిధిలోని జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో ఈ కూల్చివేతలు జరిగాయి. మొత్తం 16,000 చదరపు గజాల విస్తీర్ణంలో అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు జేసీబీల సహాయంతో నేలమట్టం చేశారు.ఈ స్థలం లో కబ్జాకు గురైన 8,500 చదరపు గజాల విస్తీర్ణంలో రెండు పార్కులు, 5,000 చదరపు గజాల రోడ్లతోపాటు, 300 గజాల ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన హోటల్ షెడ్లను కూడా తొలగించారు. 'ప్రజావాణి' కార్యక్రమానికి వచ్చిన ఒక ఫిర్యాదు ఈ భారీ ఆపరేషన్‌కు కారణమైంది.జూబ్లీ ఎన్‌క్లేవ్ లేఅవుట్‌లోని పార్కును జైహింద్ రెడ్డి అనే వ్యక్తి కబ్జా చేశారంటూ స్థానికులు హైడ్రా కు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, ఆక్రమణలు నిజమేనని నిర్ధారించుకున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు గురువారం ఈ కూల్చివేతలు చేపట్టారు.భూమిని స్వాధీనం చేసుకున్న అనంతరం, పార్కుల చుట్టూ అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ స్థలం అని తెలిపే బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కబ్జాలకు పాల్పడిన వారిపై పోలీస్ కేసులు కూడా నమోదు చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ లేఅవుట్‌కు 1995లో అనుమతులు రాగా, 2006లో ప్రభుత్వం దీనిని రెగ్యులరైజ్ చేసింది.

### స్టాండింగ్ కమిటీలో 32అంశాలు, 7 టేబుల్ ఐటమ్‌లకు

# కమిటీ ఆమోదం

**జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వెల్లడి**






హైదరాబాద్, మేజర్ న్యూస్ ( సిటీ ప్రతినిధి): నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం లో జరిగింది. కమిటీ సమావేశంలో 32, అంశాలు, 7 టేబుల్ ఐటమ్ లకు సభ్యులు ఆమోదించినట్లు మేయర్ తెలిపారు.

ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, పర్వీన్ సుల్తానా, డా.ఆయేషా హుమేరా, మహమ్మద్ సలీం, బాత జబీన్, మహాలక్ష్మి రమన్ గౌడ్, సి.ఎన్.రెడ్డి, మహమ్మద్ బాబా ఫసియుద్దీన్, వి.జగదీశ్వర్ గౌడ్, బూరుగడ్డ పుష్ప పాల్గొన్నారు. జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ లు రఘు ప్రసాద్, సత్యనారాయణ వేణుగోపాల్, సుభద్ర, పంకజ, గీతా రాధిక, మంగతాయారు, జోనల్ కమిషనర్ లు ఆర్ హేమంత్ కేశవ్ పాటిల్, హేమంత్ సహదేవ్ రావు, అపూర్వ్ చౌహాన్, రవి కిరణ్, శ్రీనివాస్ రెడ్డి సిసిపి శ్రీనివాస్, సి ఈ లు భాస్కరరెడ్డి, సహదేవ్ రత్నాకర్, అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్.

## పర్యావరణ హితంకోసం సామాజిక భాగస్వామ్యం ఎంతో అవసరం

**-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**




సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః పర్యావరణహితంకోసం సామాజీక భాగస్వామ్యం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ప్రభుత్వ పాఠ శాలలో విద్యార్థులకు ఉపయోగార్థమై గ్లోబల్ రైల్వే కన్సల్టెన్సీ సంస్థ బార్సిల్ ప్రతినిధులు రీ సైక్లింగ్ ద్వారా చేయబడిన ఈకో ఫ్రెండ్లీ ప్రొడక్ట్ పర్యావరణ హిత నోట్‌బుక్స్,పెన్సిల్స్‌లను 500 మంది విద్యార్థులకు జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్లోబల్ రైల్వే కన్సల్టెన్సీ సంస్థ బార్సిల్ సహకారాన్ని అభినందిస్తూ విద్యార్థుల్లో పర్యావరణహితంపై అవగాహన పెంపొందించడానికి ఇటువంటి సహకారాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎం.డి. సునీల్ శ్రీనివాస,డైరెక్టర్ మనోరంజన్ పర్షాద్,హెడ్ హెచ్.ఆర్. వాణి సోమ, సీనియర్ మేనేజర్ సాయి సురేష్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### వినాయక చవితి ఏర్పాట్లపై

# ప్రత్యేక శ్రద్ధ చూపండి

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



కూకట్ పల్లి మేజర్ న్యూస్ : బతుకమ్మ, దసరా నవరాత్రి ఉత్సవాలకు ముందస్తు ఏర్పాట్లు చూడాలని.. కూకట్ పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. వినాయక చవితి మొదలుకొని రాబోయే పండుగలను ఘనంగా నిర్వహించే విధంగా కూకట్ పల్లి నియోజకవర్గం పరిధి లో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని మాధవరం కృష్ణా రావు కూకట్ పల్లి జోనల్ కమీషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి కోరారు. మిగతా 2లో

# జలమండలిలో రెవిన్యూ పెంపునకు సంస్కరణలు : జలమండలి ఎండి అశోక్ రెడ్డి వెల్లడి





హైదరాబాద్ మేజర్ న్యూస్ ( సిటీ ప్రతినిధి): జలమండలి రెవిన్యూ పెంచడమే లక్ష్యంగా నూతన సంస్కరణలు ప్రవేశపెట్టనున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ తో కలిసి గురువారం రోజున జూబ్లీహిల్స్ లోని జలమండలి థీమ్ పార్క్ లో రెవిన్యూ, ఐటీ విభాగ అధికారులతో మేథోమథన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ... ఇప్పటికే జలమండలి అందిస్తున్న నాణ్యత సేవలకు గాను ఇప్పటికే మంచి గుర్తింపు లభించిందని తెలిపారు. అలాగే జలమండలి ఆదాయం పెంచేందుకు రెవిన్యూ, ఐటీ విభాగాల్లో నూతన సంస్కరణలను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.అందులో భాగంగా ప్రస్తుతం డొమెస్టిక్ కేటగిరీ కింద ఉన్న వాణిజ్య కనెక్షన్లను గుర్తించడం అవసరమని ఆయన అన్నారు. ఇందుకోసం జిహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలోని నాన్-రెసిడెన్షియల్ భవనాల జాబితా సేకరించి వాటిని వాటర్ సప్లై కనెక్షన్లతో పోల్చాలని సూచించారు. బోర్డుకు వచ్చే ఆదాయం కొత్త ప్రాజెక్టులకు సరిపోకపోయినా, నీటి సరఫరా మరియు సీవరేజ్ సేవల మెరుగుదలకు మాత్రం ఉపయోగపడుతుందని వివరించారు.అలాగే, ఎంతో ప్రయాసతో సుదూర ప్రాంతాల నుంచి తరలిస్తున్న విలువైన నీటిని తక్కువ ధరకు తాగునీరు సరఫరా చేస్తున్నదని ఆయన గుర్తుచేశారు.జలమండలి ఆదాయం పెరగడానికి.. మరింత మెరుగైన సేవల కొరకు రెవిన్యూ, ఐటీలో ప్రతిపాదించిన సంస్కరణలను జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ మేథోమథన సదస్సులో వివరించారు.

ప్రతిపాదించిన కొన్ని ముఖ్యమైన సంస్కరణలు:

అన్ని ఓ అండ్ ఎం, సెక్షన్ల వారీగా సరఫరా చేసే నీటి పరిమాణం, పైపు పరిమాణం, మీటర్ ను బట్టి వివరాల నివేదికలను రూపొందించి తుది నిర్ణయం తీసుకోవడం.

మీటర్ లేని కనెక్షన్లకు బిల్లింగ్ విధానం.. ప్రస్తుత డాకెట్ సగటు కంటే మెరుగైన ప్రత్యామ్నాయాలను అధ్యయనం చేయడం.

ఎప్పటికప్పుడు రెవిన్యూ వివాదాల పరిష్కారం

బల్క్ కనెక్షన్లు మరియు అంగీకరించిన నీటి సరఫరా పై ఖచ్చితమైన విధానం.

అవసరమైన ప్రాంతాల్లో కనీస బిల్లింగ్‌లో మార్పులు చేయడం.

మీటర్ రీడింగ్ ఏజెన్సీస్ నియామకం కోసం టెండర్ పిలవడం.

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిల వసూలు %-%వ్యూహ రచన.

ఆన్లైన్ లో వాటర్ ఫీజబిలిటీ ధ్రువపత్రం..

జిహెచ్ ఎంసీ పరిధిలోని నూతన భవన నిర్మాణదారులకు జలమండలి ఆన్లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. కొత్తగా భవనాలు నిర్మించుకునే వారు జీహెచ్ఎంసీ అనుమతుల కోసం సమర్పించాల్సిన వాటర్ ఫీజబిలిటీ ధ్రువపత్రాన్ని జారీ చేసే ప్రక్రియను జలమండలి సులభతరం చేసి ఆన్లైన్ లోనే పొందేలాగా సరికొత్త సదుపాయాన్ని కల్పించింది.

జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ కలిసి జూబ్లీహిల్స్ లోని జలమండలి థీమ్ పార్క్ లో ఈ ఆన్‌లైన్‌లో వాటర్ ఫీజబిలిటీ ధ్రువపత్రాన్ని జారీ చేసే సేవలను లాంఛనంగా ప్రారంభించారు. గ్రేటర్ పరిధిలోని నూతన భవనం నిర్మించాలంటే జీహెచ్ఎంసీ పర్మిషన్ తప్పనిసరి. ఆ పర్మిషన్ కోసం భవన యజమానులు విద్యుత్ ఫీజబిలిటీ తో పాటు జలమండలి జారీ చేసే వాటర్ ఫీజబిలిటీ ధ్రువపత్రం సమర్పించాలి. గతంలో ఈ సర్టిఫికెట్స్ పొందాలంటే జలమండలి సర్కిల్ కార్యాలయాల్లో, తర్వాత ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలో సీజీఎం జారీ చేసేవారు. వివిధ కారణాల రీత్యా ఈ ప్రక్రియలో జాప్యం జరిగేది. దీన్ని నివారించి, ఆ ప్రక్రియను సులభతరం చేయడానికి ధ్రువపత్రాల జారీని ఆన్‌లైన్ లోనే పొందేలాగా మార్పులు చేశారు.

# వినాయక చవితి ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

***మొదటిపేజీ తరువాయి...*** బుధవారం జోనల్ కమీషనర్ కార్యాలయంలో ఆయన్ని కలిసి వినాయక చవితి తదితర పండుగల విషయమై చర్చించారు. ఈనెల 27 నుంచి మొదలయ్యే వినాయక చవితి ఉత్సవాలకు నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లలలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని, నిమజ్జనం నిర్వహించే చెరువుల వద్ద ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో ఏచిన్న ఇబ్బందులు లేకుండా అన్ని చెరువులు, కుంటల వద్ద ప్రత్యేక సిబ్బంది నియామకం, భారీ క్రేన్ల ఏర్పాటు, నిత్యం అన్ని ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకోవడం ద్వారా పండుగలను ఘనంగా జరుపుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా వినాయక చవితి తరువాత వచ్చే బతుకమ్మ పండుగను, దసరా నవరాత్రి ఉత్సవాలను కూడా దృష్టిలో ఉంచుకొని చేపట్టాల్సిన ఏర్పాట్లపై ముందస్తు అనుమతులు తీసుకోవడం, పనులు నిర్వహించడం వంటివి వెంటనే చేపట్టాలని సూచించారు. నియోజకవర్గంలో వర్షాల మూలం గా ఇబ్బందులు లేకుండా వాటర్ లాగింగ్ పాయింట్లపై అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలలలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తూ అందరి సమన్వయంతో సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ చిన్నారెడ్డి, ఈఈతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# శ్రీభాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి నూతన కార్యవర్గంను ప్రకటించిన చేగురి వెంకటరమణ



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః ఉస్మాన్‌గంజ్‌లోని శ్రీ భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితికి నూతన కార్యవర్గంను నియమించడం జరిగిందని తెలంగాణ ఛాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షులు చేగురి వెంకటరమణ ప్రకటించారు. బుధవారం బాస్ సంస్థ కార్యాలయంలో నూతన కార్యవర్గం పేర్లను ప్రకటించారు. సమితి అధ్యక్షులుగా మేడిశెట్టి రాకేష్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.భద్రేశ్వర్,కోశాధికారి అనిల్‌కుమార్,ఉపాధ్యక్షులు ఎం. శ్రీనివాస్,యడవల్లి ఆశోక్,నరేందర్ సేర్,ఉప కోశాధికారి శ్రీహరి,సంయుక్త కార్యదర్శి బి. విజయానంద్, కె.హరికృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రెటరి ఎం. అంజన్‌రాజ్, బాల్యం అధ్యక్షులు కె.రాజు, కార్యదర్శి నర్సింగ్‌రావు, కోశాధికారి విజేందర్‌రెడ్డి, జీవ కారుణ్యం అధ్యక్షులుగా నరేష్ పటేల్, ఉపాధ్యక్షులు రాందేవ్ ఉపాధ్యాయ,కార్యదర్శి ఎస్.నరేష్‌కుమార్,ఉప కోశాధికారి నాగేశ్వర్‌రావు, ఐ.టి.సెల్ నాయకులు వేణుగోపాల్,రోహిత్‌కుమార్,కళ్యాణ్,ప్రింట్ అండ్ ఏలక్ట్రానిక్ మీడియా ఇన్‌ఛార్జ్ కాలే అమర్‌నాథ్,న్యాయ సలహాదారులు వి.ఎస్.సుధాకర్‌తోపాటు కార్యవర్య సభ్యులు ఏన్నికయినట్లు చేగురి వెంకటరమణ తెలిపారు. ఈ ఏన్నికలను ఏన్నికల నిర్వహణ అధికారులుగా వి. శ్రీనివాస్,ఎం. విజయ ఆనంద్,న్యాయవాది విజయ సుధాకర్‌లు వ్యవహారించినట్లు ఆయన చెప్పారు.

# జెన్నారా క్లినిక్స్ ప్రారంభించిన నటి శ్రీయా శరణ్



అమీర్ పేట,మేజర్ న్యూస్:చర్మ సంరక్షణ, సౌందర్య చికిత్సలను మరింత అందుబాటులోకి తీసుకురావడంలో తమ ప్రయాణంలో మరో ముఖ్యమైన మైలురాయిని జెన్నారా క్లినిక్స్ చేరుకుందని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సరికొత్త బ్రాంచ్ ప్రారంభోత్సవానికి ప్రముఖ భారతీయ నటి శ్రీయా శరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రపంచస్థాయి వైద్య నైపుణ్యం, అత్యాధునిక సాంకేతికతను మేళవించి,జెన్నారా క్లినిక్స్ హైదరాబాద్‌లో చర్మ, వెంట్రుకల సంరక్షణలో అత్యంత విశ్వసనీయమైన క్లినిక్స్‌లో ఒకటిగా ఎదిగిందన్నారు.జెన్నారా క్లినికల్ కచ్చితత్వంతో పాటు వెచ్చదనం, ప్రశాంతతను అందించే చికిత్సలు అందుబాటులో ఉంటాయి.రోగులు చర్మాన్ని పునరుత్తేజితం చేసే చికిత్సలు,జుట్టు పెరుగుదలకు పీఆర్‌పీ,క్లినికల్ ఫేషియల్స్, మొటిమలు,మచ్చల నిర్వహణ,యాంటీ-ఏజింగ్ సొల్యూషన్స్ వంటి ఆధునిక సేవలను ఆశించవచ్చు.క్లినిక్‌లో డెర్మటాలజీతో పాటు సంపూర్ణ సంరక్షణను కలిపే ప్రత్యేకమైన వెల్‌నెస్ ప్రోగ్రామ్‌లను కూడా ప్రవేశపెడుతున్నారు.ఇది కేవలం ఒక చర్మ క్లినిక్ కంటే ఎక్కువ అని తెలియజేస్తుందన్నారు.జెన్నారా ఎదుగుదల వెనుక బలమైన నాయకత్వ బృందం ఉందన్నారు.ఈ బృందంలో గోకుల్ కృష్ణ వంకాయలపాటి,కంచర్ల నాగ లక్ష్మి రెడ్డి, ప్రియాంక రెడ్డి ముత్యాల,అధిప్ అయ్యర్, ఇసుకపట్ల మహేశ్వరి ఉన్నారన్నారు.వీరంతా క్లినికల్ ఎక్సలెన్స్‌తో పాటు రోగుల ఆత్మవిశ్వాసం,సంరక్షణపై పూర్తి దృష్టి సారించే జెన్నారా తత్వాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించారన్నారు.

# గజల్స్ గ్రంథాలవిష్కరణ



రవీంద్ర భారతి, మేజర్ న్యూస్ 21 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గజళ్ళ సాహితీవైద్యం వాట్స్ అప్ సమూహం ఆధ్వర్యంలో

గజళ్ళ సాహితీవైద్యం భావలహరి (గజళ్ళ సంకలనం), వెన్నెలసిరులు, దరహాస చంద్రికలు, వసంతవల్లరి మంచుపూలు, రాగవిలాసం-గజల్ గ్రంథాల ఆవిష్కరణ మహోత్సవం

రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ గజల్స్ కవి, పరిశోధకుడు డాక్టర్ పోతగాని సత్యనారాయణ పాల్గొని పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో గజల్స్ ఆరు పుస్తకాలను ఆవిష్కరణ జరగడం సంతోషదయకమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలను ఆవిష్కరించాలని ఆకాంక్షించారు . తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ వారు రికార్డుగా గుర్తించి రికార్డులో స్థానం కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గజల్ శిరోమణి ఆర్ వి ఎస్ఎస్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ పరికె నాగభూషణం, ప్రముఖ కవి డా. ఉమాదేవి జంధ్యాల పాల్గొన్నారు.

# ఎం.ఎన్.జె.క్యాన్సర్ ఆసుపత్రిలో రోగుల సహాయకులకు అన్నదానం చేపట్టిన డా. సయ్యద్ ముజీబ్ హుస్సేనీ



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు,టిఎన్‌జివో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎస్. ముజీబ్‌హుస్సేనీ ఆధ్వర్యంలో గురువారం రెడ్‌హిల్స్‌లోని ప్రభుత్వ ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రి ప్రాంగణంలో 700 మంది రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జివోస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ముజీబ్‌హుస్సేనీ,రాష్ట్ర కోశాధికారి ఎం. సత్యనారాయణగౌడ్‌లు పాల్గొని రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, కె.ఆర్.రాజ్‌కుమార్,బి. శంకర్,వైదిక్,చంద్రశేఖర్,మహ్మద్ ముస్తఫా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ పెట్టుబడిదారులకు సువర్ణావకాశం - ఈబీ5 పెట్టుబడికి ఇదే సరైన తరుణం



హైదరాబాద్, మేజర్ న్యూస్: భారతీయ పెట్టుబడిదారులకు ఇది సువర్ణావకాశమని అమెరికా ఇమ్మిగ్రేషన్ అటార్నీ నాదదూర్ కుమార్ తెలిపారు. అమెరికా గ్రీన్‌కార్డ్ పొందడం భారతీయ పౌరసత్వాన్ని వదిలేయడం కాదన్నారు. ఈబీ-5లో పెట్టుబడి పెట్టడానికి ఇదే సరైన సమయమన్నారు. ఇది అమెరికాలో నివసించే అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. పెట్టుబడులకు 'వైట్ పాస్‌పోర్ట్' (రీ-ఎంట్రీ పర్మిట్) లభిస్తుందన్నారు. దీని ద్వారా రెండు సంవత్సరాల పాటు (పరిమితిని పొడిగించుకోవచ్చు) అమెరికా వెలుపల ఉండగలరన్నారు. ఇది వ్యాపార, కుటుంబ అవసరాలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందన్నారు. భారతీయులకు ఈబీ-5 వీసా బ్యాక్‌లాగ్ చాలా తక్కువగా ఉందన్నారు. ఇది అరుదైన అవకాశమన్నారు. భారత్‌లో పెరుగుతున్న సంపద, రియల్ ఎస్టేట్ నుంచి వస్తున్న ఈక్విటీ, హెచ్-1బీ/ఎఫ్-1 వీసాదారులు తమ కెరీర్‌లో ముందుకు సాగడం తదితర ఈబీ-5కి డిమాండ్‌ను పెంచుతాయని పేర్కొన్నారు. అమెరికా ఇమ్మిగ్రేషన్ చట్టం ప్రకారం.. ప్రతి దేశానికి గ్రీన్‌కార్డులు ఏడు శాతం కంటే ఎక్కువ ఇవ్వరన్నారు. భారత్ నుంచి ఇప్పటికే ఎఫ్-1, హెచ్-1బీ, ఈబీ-5కి అధిక డిమాండ్ ఉన్నందువల్ల భవిష్యత్తులో క్యూలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఇది బంగారు అవకాశమని, ఎక్కువ కాలం ఉండదని హెచ్చరించారు. గతంలో ఈబీ-5కు పెద్దగా ప్రాధాన్యం ఉండేది కాదన్నారు. ఇటీవల రియల్ ఎస్టేట్ ఆధారంగా సంపద పెరగడంతో అనేక మంది భారతీయులు ఈ పెట్టుబడి పెట్టగలుగుతున్నారని చెప్పారు. హెచ్-1బీ వీసా కలిగినవారు, ఎఫ్-1 విద్యార్థులు అమెరికాలో స్థిరపడినప్పుడు గృహ యాజమాన్యం ద్వారా ఈక్విటీ సాధిస్తారన్నారు. దీనికి తల్లిదండ్రుల సహాయం ఉండటంతో ఈబీ-5 పెట్టుబడి సాధ్యమవుతోందని తెలిపారు. వివిధ వీసా విభాగాల్లో భారతీయులు ఎక్కువ కాలం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇది వివక్ష కారణంగా కాదని, డిమాండ్ కోటా సంఖ్యను మించి ఉండటం వల్లేనన్నారు. కనీస పెట్టుబడి రూ. ఆరు నుంచి ఏడు కోట్లు అన్నారు. అనేక కుటుంబాలు ఈక్విటీ, రుణాలు, తల్లిదండ్రుల సహాయం ద్వారా మొత్తాన్ని సమకూర్చుకుంటున్నారని పేర్కొన్నారు. ఈబీ-5ను నియంత్రించే చట్టాలు దశాబ్దాలుగా స్థిరంగా ఉన్నాయన్నారు. సలహాదారులు, రీజినల్ సెంటర్ల అర్హతలను కచ్చితంగా పరిశీలించాలన్నారు.

# విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : బాలలు తమలో సాహిత్య అభిరుచి పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సంపాదకులు మణికొండ వేద కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలంలోని అనంత సాగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వ్రాసిన "అనంత సాగర్ అక్షర కెరటాలు "అనే బాలల కథల పుస్తకాన్ని బాల చెలిమి,దక్కన్ ల్యాండ్ సంపాదకులు మణికొండ వేదకుమార్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ఒక చరిత్ర ఉంటుందని,అలాంటి చరిత్రను లిఖించి,పుస్తక రూపంలోకి తెచ్చి భావితరాలకు అందించాలని కోరారు. బాలల రచనలు ముద్రించడానికి చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ అకాడమీ సహాయం చేస్తుందని చెప్పారు. ఉపాధ్యాయులు బాల సాహిత్యాన్ని ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థులు ఎక్కువగా పుస్తకాలు చదవాలని, అందుకు గాను గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.
ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు ఆచార్యులు డా.రఘు ఏడవ తరగతి విద్యార్థి బి.విశ్వతేజ వ్రాసిన "విశ్వతేజం " కథల పుస్తకాన్ని ఆవిష్కరించి " అభినందించారు. విద్యార్థులు చిన్న వయసులోనే కథలు వ్రాయడం అద్భుతమని కొనియాడారు.ప్రధానోపాధ్యాయురాలు కోట జ్యోతి అధ్యక్షతన జరిగిన



సమావేశంలో భైతి దుర్గయ్య సంపాదకత్వంలో రూపొందించిన పుస్తకాల ఆవిష్కరణ అనంతరం పాఠశాలలో బాల చెలిమి గ్రంథాలయాన్నీ ప్రారంభించారు.పాఠశాలకు వందకు పైగా పుస్తకాలు బహుకరించారు.ఈ కార్యక్రమంలో బాల సాహితీ వేత్త గరిపెల్లి అశోక్,కథల తాతయ్య రాజమౌళి,తోట మధుసూదన్, గ్రామస్తులు ధర్మయ్య,కిష్టారెడ్డి,బాబయ్య, ఉపాధ్యాయులు శ్రీదేవి,సమ్మయ్య, నరేష్,దుర్గయ్య, పర్శరాములు, బాల చెలిమి ప్రతినిధులు విద్యార్థుల తల్లిదండ్రులు,యువకులు,సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

### చాయ్ కా అడ్డా" షాప్‌ను ప్రారంభించిన కార్పొరేటర్ శ్రీ రాగం నాగేందర్ యాదవ్



కొండాపూర్,మేజర్ న్యూస్ : శేరిలింగంపల్లి డివిజన్ లో గల డిఎల్ఎఫ్ మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన "చాయ్ కా అడ్డా" ను కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ.. యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా వ్యాపార రంగాలలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అలాగే మరికొందరికి ఉపాధి కల్పించాలని, యువత యొక్క స్వయం ఉపాధి ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కైలాస సంగమేష్ గుప్త, శ్రీనివాస్ గుప్త, ప్రవీణ గుప్త, నటరాజ్, సాగర్, ఆనంద్, వెంకటేష్, రాహుల్, యశ్వంత్, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చందానగర్ మలబార్ గోల్డ్ డైమండ్స్‌లో వ్యాన ఆవిష్కరణ



చందానగర్,మేజర్ న్యూస్ : మలబార్ గోల్డ్ డైమండ్స్ లో సరికొత్త రత్నాభరణ సేకరణ అయిన "వ్యాన " ను గురువారం చందానగర్ లోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వినియోగదారులు ఆవిష్కరించారు. వజ్రంతో ప్రేరేపితమైన తేజస్సును, వర్ణరంజితంగా శక్తివంతమైన రత్నాలను 18, 22 క్యారెట్ల బంగారం తో ఎంతో శ్రద్ధగా వ్యానను సుందరంగా రూపొందించారు. వ్యాన అనేది కేవలం ఆభరణాల సేకరణ మాత్రమే కాదని, ఇది మహిళ స్ఫూర్తి అనేక చాయిలకు ప్రశంస అని స్టోర్ ఇంచార్జి దీపక్ వివరించారు. వ్యానలోని ప్రతి రత్నం, మహిళలోని బలం, దయ, వ్యక్తిత్వం కథను చెబుతోందన్నారు. వ్యాన ఆభరణాలు ధరించే మహిళల మాదిరిగానే, ప్రతి ఆభరణం నిజంగా ప్రత్యేకమైన తేజస్సును ప్రసరింపజేస్తుందన్నారు. ప్రతి ఫెస్టివల్‌లో భాగంగా వినియోగదారులు అన్ని రకాల రత్నాలు, అస్ కట్ వజ్రాల ఆభరణాల తరుగు చార్జీలపై 25 శాతం వరకు తగ్గింపు పొందవచ్చని అన్నారు.

### అదృశ్య గాయాలపై పోరాటం హైదరాబాద్ కార్యకర్తకు జాతీయ గౌరవం




సోమాజిగూడ/మేజర్ న్యూస్: గచ్చిబౌలికి చెందిన మానవ హక్కుల పోరాటయోధురాలు, సామాజిక కార్యకర్త ఏక్తా వివేక్ వర్మ జాతీయ స్థాయి గౌరవాన్ని అందుకున్నారు. ఆమె స్థాపించిన ఇన్‌విజిబుల్ స్కార్స్ ఫౌండేషన్ ద్వారా గృహ హింస బాధితులకు చేస్తున్న సేవలను గుర్తిస్తూ, 2025 అమేజింగ్ ఇండియన్ అవార్డుతో సత్కరించారు.
ఈ అవార్డును న్యూఢిల్లీలో కేంద్ర కార్మిక మరియు యువజన వ్యవహారాల మంత్రి మన్‌సుఖ్ లక్ష్మణ్‌భాయ్ మండవియా ఆమెకు అందజేశారు. టైమ్స్ నౌ అందించే ఈ ప్రతిష్టాత్మక అవార్డు, ధైర్యం, దయ మరియు నిబద్ధతతో సమాజాన్ని మార్చే వ్యక్తులను గౌరవించడానికి ఏర్పాటు చేయబడింది. దేశవ్యాప్తంగా ఎంపికైన 12 మంది మౌనయోధుల్లో ఏక్తా ఒకరు.
గృహ హింస వ్యతిరేక పోరాటం
ఏక్తా, గృహ హింస %డ% వేధింపుల నిపుణురాలు (%DVA expert%), సర్టిఫైడ్ %ూశీూ% ట్రైనర్ మాత్రమే కాకుండా, చీవనింగ్ గురుకుల్ ఫెలో. ఆమె ఫౌండేషన్ ద్వారా బాధిత మహిళలకు ఆశ్రయం, చట్ట సహాయం, ఉపాధి అవకాశాలు, మరియు భావోద్వేగ పునరావాసం అందిస్తున్నారు.
"ఈ గౌరవం నాకు మాత్రమే కాదు, ధైర్యంగా ఎదురొడ్డి నిలిచిన ప్రతి బాధితురాలికీ అంకితం," అని ఏక్తా తెలిపారు. కుటుంబ వ్యవస్థలలో కనిపించే భావోద్వేగ హింసను ప్రత్యక్షంగా చూసిన అనుభవమే తన ఈ ప్రయాణానికి ప్రేరణ అని ఆమె చెప్పారు.
ప్రతిష్టాత్మక న్యాయనిర్ణేతలు
ఈ అవార్డుల ఎంపికలో నీర్జా బిర్లా, పద్మజా రూపరెల్, సంజీవ్ బిక్‌చందానీ, ప్రసూన్ జోషి, ఆశిష్‌కుమార్ చౌహాన్ వంటి ప్రముఖులు జ్యూరీగా వ్యవహరించారు.

# సీఎంఆర్ఎఫ్' ఎల్ఓసీ పత్రాలు అందజేత



మల్కాజిగిరి, మేజర్ న్యూస్ : నేరేడ్ మెట్ డివిజన్ యాప్రాల్‌కు చెందిన భీమేశ్వరరావు అనారోగ్యానికి గురై నిమ్స్ ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో బాధితుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సహకారంతో 'సీఎంఆర్ఎఫ్' కి దరఖాస్తు చేసుకున్నాడు. దీనిని పరిశీలించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, బాధితుడికి రూ 2,00,000 (రెండు లక్షల రూపాయల) మంజూరు చేశారు. సంబంధిత ఎల్ఓసి పత్రాన్ని గురువారం తన కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి లబ్ధిదారుడికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాజశేఖర్, మధుసూదన్ రెడ్డి, రమేష్, సర్వే నరేష్, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అభినందన...




ముషీరాబాద్ మేజర్ న్యూస్ : అభినందన సంస్థ మాతృ వందనం కార్యక్రమాన్ని త్యాగరాయ గానసభలో నిర్వహించింది.మాదిరాజు వరలక్ష్మి పురస్కారాన్ని రచయిత్రి డా. డి. కామేశ్వరికి ప్రధానం చేశారు.రామలక్ష్మి రంగాచార్యులు కు మాతృవందనమ్ కార్యక్రమం జరిగింది. డా. కేవీ రమణా చారి రిటైర్డ్ ఐ ఏ ఎస్ భీమన్న సాహితీ నిధి అధ్యక్షులు హైమవతి భీమన్న డా .పి.మధుసూధన్ రావు జీవ్వీ ఎన్ రాజు అతిధులుగా పాల్గొన్నారు.అభినందన భవాని ఈ వేడుకను నిర్వహించారు

## ఘనంగా 'స్టైలస్ ఫర్నిచర్ షాప్' 4 వ వార్షికోత్సవం





మల్కాజిగిరి, మేజర్ న్యూస్: ఆర్టీసి కాల నీలోని 'స్టైలస్ ఫర్నిచర్ షాప్' 4 వ వార్షికో త్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ముఖ్య అతిథిగా హజరై షాప్ ఓనర్స్ చంద్ర కాంత్, కిరణ్ కుమార్ లకు శుభాభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు టి.వెంకటేష్ యాదవ్, నాయకులు అశోక్ గౌడ్, జి.కె. శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆనంద్, పి.కుమార్, స్వామి, నాగరాజు, రవీందర్, పరుశురాం, అంజి, సూర్య, సంతోష్, హ్యారీ, శివ తదితరు లు పాల్గొన్నారు

## పాటల విభావరి..!!



ముషీరాబాద్ మేజర్ న్యూస్: గట్టుపల్లి సీతారామారావు జీ యస్ ఆర్ ఫ్రెండ్స్ ఈవెంట్స్ మానస సంస్థ ఆధ్వర్యంలో పాటల విభావరి జరిగింది.రుక్మిణి సీతారామారావు నాగరాజు కుమారి ప్రసాదరావు శోభన్ బాబు యం.అరుణ గోవిందా లక్ష్మి పాటలు పాడారు.కవి రఘు శ్రీ ఈ వేడుకను సమన్వయము చేశారు.

## గో బ్యాక్ మార్వాడీ ఉద్యమానికి రాజకీయ రంగు : మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు




నిజాంపేట్ మేజర్ న్యూస్ :మార్వాడీ గో బ్యాక్ పేరుతో హిందూ సమాజాన్ని చీల్చే కుట్రలు జరుగుతున్నాయని, గో బ్యాక్ మార్వాడీ ఉద్యమానికి రాజకీయ రంగు పులుముతున్నారని మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు అన్నారు. గురువారం పలువురు హిందూ బంధువులు మార్వాడీలతో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి పథంలో శరవేగంగా దూసుకుపోతున్న భారతదేశాన్ని చూసి తట్టుకోలేక పోతున్న విదేశీ దుష్టుల సాయంతో దేశంలోని ద్రోహులు విభజన రాజకీయాలు చేస్తున్నారని హిందూ బంధువులు ఆరోపించారు. గో బ్యాక్ మార్వాడీ అంటూ కొందరు పసలేని నినాదాలతో దేశ ప్రజల మధ్య చిచ్చురేపడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. దేశంలో అందరికీ ఎక్కడైనా బతికే హక్కు, వ్యాపారం, ఉద్యోగం చేసుకొనే హక్కు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కల్పించిందన్నారు. ఎవరో ఒకరిద్దరు చేసిన తప్పులకు ఒక సామాజికవర్గం మొత్తాన్ని నిందించడం, బెదిరించడం తగదన్నారు. మన రాష్ట్రం నుంచీ ఎంతో మంది వివిధ రాష్ట్రాల్లో, దేశాల్లో విద్య, ఉద్యోగం, వ్యాపారాల్లో ఉన్నారని, అక్కడి వాళ్లు ఇలాగే చేస్తే మన వాళ్ల పరిస్థితేమిటని ప్రశ్నించారు. ఇటువంటి విభజనవాద నినాదాలతో మిథ్యా ఇతివృత్తాలను వ్యాపింపజేస్తున్న ద్రోహుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు, రచ్చ చక్రధర్, దాసి నాగరాజు, బాబు చౌదరి, భవర్లాల్, శరవణ్ లాల్, మోహన్ లాల్, నిర్మల్, సూరజ్, బోలా రామ్, రాజారామ్, భరత్, షోలా రామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓబిసిలను మరో సారి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ

▶▶ రాహుల్ గాంధీ ఓబిసి నినాదం ఉత్తదే ▶▶ బిసి జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్



వనస్థలిపురం,మేజర్న్యూస్ఃకాంగ్రెస్ పార్టీ ఓబిసిలను మరోసారి మోసం చేసిందని బిసి జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. దేశ జనాభాలో ఓబిసిలు 70 కోట్ల మంది ఉన్నారని, కాంగ్రెస్ పార్టీకి ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఓబిసి వ్యక్తి దొరకలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపం మరో సారి బయట పడిందన్నారు,. రాహుల్ గాంధీ ఓబిసి నినాదం ఎత్తుకొని దేశమంతా తిరుగుతుంటే ఓబిసినుంచి ఉప రాష్ట్రపతి అభ్యర్థి రాహుల్ గాంధీకి కన్పించలేదన్నారు. రాహుల్ గాంధీ ఓబిసి నినాదం ఉత్తదే అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి ఓబిసిలను మోసం చేస్తూ పబ్బం గడుపుతుందని అజయ్ కుమార్ యాదవ్ విమర్శించారు.

## ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలి : బీజేపీ సీనియర్ లీడర్ సుహాసిని శక్తి




నిజాంపేట్ మేజర్ న్యూస్ : పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని బీజేపీ సీనియర్ లీడర్ సుహాసిని శక్తి పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వం 100 రోజుల ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా కెఆర్సిఆర్ క్రాంతి నగర్ లోని డివిజన్ 1 కాలనీలోని ఆకుపచ్చ వాతావరణం కోసం సుహాసిని శక్తి ఒక అడుగు ముందుకు వేసి 200 చెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఒక మొక్కను నాటి, దేశ పరిరక్షణలో భాగం కావాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేవలం మొక్కలు నాటి వదిలేయకుండా వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కిరణ్, సీతారాం, మధు, సురేష్ నాయుడు, భరత్, సులోచనా, లక్ష్మి, జ్యోతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పాత పెద్దమ్మ దేవాలయ పునః ప్రతిష్ట మహెూత్సవ ఉత్సవాల్లో పాల్గొన మాజీ మేయర్



నిజాంపేట్ మేజర్ న్యూస్ : నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ గోకరాజు రంగారాజు కాలేజీ రోడ్ లో శ్రీ పాత పెద్దమ్మ దేవాలయ పునః ప్రతిష్ట మహెూత్సవ ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహెూత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నిజాంపేట్ గ్రామ పెద్దలు కోలన్ లీడర్ నర్సింహా రెడ్డి, నిజాంపేట్ శ్రీనివాస్ నగర్ అయ్యప్ప స్వామి దేవాలయ చైర్మన్ కోలన్ చంద్ర శేఖర్ రెడ్డిలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సురేష్ రెడ్డి, బొర్రా దేవి చందు ముదిరాజ్, ఆవుల పావని జగన్ యాదవ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు తల్లారి వీరేష్, శ్రీ పాత పెద్దమ్మ దేవాలయ ప్రెసిడెంట్ కోలన్ జనార్ధన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కోలన్ జయరామ్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ కోలన్ రాజమోహన్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ కోలన్ ప్రతాపరెడ్డి , ట్రెజరర్ కోలన్ విజయలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కోలన్ కమలమ్మ, కోలన్ జ్యోతి, కోలన్ మాధవి, కోలన్ చంద్రశేఖర్ రెడ్డి, కోలన్ ముత్యంరెడ్డి, గ్రామ పెద్దలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆవిష్కరణలు, పరిశోధనలకు టీ వర్క్స్‌ను వినియోగించుకోవాలి

- ఐటి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్



హైదరాబాద్, మెజ్కర్ న్యూస్: సాంకేతిక ఆవిష్కరణలు, పరిశోధనలకు టీ వర్క్స్ ను కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ ఐటీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్ అన్నారు. టీ వర్క్స్ లో గురువారం టీ వర్క్స్ ఆధ్వర్యంలో 'భారత దేశంలో తయారీ ఆవిష్కరణ%-% పర్యావరణ వ్యవస్థను నిర్మించడం' అనే అంశంపై వివిధ ఆటోమొబైల్ సంస్థలకు చెందిన ప్రతినిధులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన టి వర్క్స్ సీఈఓ జోగేందర్ తనికెళ్ళ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టి వర్క్స్ ను రాష్ట్రస్థాయిలోనే పని చేస్తుందని అనుకోవద్దని జాతీయస్థాయిలో ఇన్నోవేషన్లతోపాటు పరిశోధనలకు వినియోగించుకోవాలని అన్నారు. మేకిన్ ఇండియా నినాదానికి టీ వర్క్స్ అనుగుణంగా పనిచేస్తుందని జాతీయస్థాయిలో పనిచేస్తున్న వివిధ రకాల సంస్థలు కూడా టీ వర్క్స్ ను వేదికగా చేసుకొని పరిశోధనలు చేయాలని సూచించారు. భవిష్యత్తు మొత్తం ఎకో ఫ్రెండ్లీ టెక్నాలజీల వైపు కంపెనీలు పరుగు పెడుతున్నాయని దానికి అనుగుణంగా టీ వర్క్స్ కూడా ఇన్నోవేటివ్ ఆలోచనలతో వచ్చేవారిని ప్రోత్సహిస్తుందని వారి నమూనాలకు పరిశోధనలు జతచేసి మరింత ఉన్నత స్థాయికి దాన్ని తీసుకెళ్ళేందుకు కషి చేస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు నమూనాల తయారీపై పనిచేసిన టి వర్క్స్ ఇకపై రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ పై కూడా పనిచేయబోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ లేలాండ్, మహేంద్ర మారుతి సుజుకి, ఎంజి మోటార్స్, వోల్వో, ఐచర్ తదితర సంస్థల రీసర్చ్ అండ్ డెవలప్మెంట్ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

## సీసీ రోడ్లను పరిశీలించిన కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



మియాపూర్,మేజర్ న్యూస్ : మియాపూర్ డివిజన్ పరిధిలోని సాయి నగర్ కాలనీలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న సి,సి రోడ్ల నిర్మాణం పనులను గురువారం స్థానిక నాయకులు, కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ సాయి నగర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు తెలిపారు, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు, ప్రజలకు స్వచ్ఛమైన చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామన్నారు. ,పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సహకారంతో మియాపూర్ డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రతాప్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, శరత్ రెడ్డి, సాయి నగర్ కాలనీ వాసులు, దామోదర్ రెడ్డి, కరీముల్లా, శ్రీకాంత్ చౌదరి, లక్ష్మీ నారాయణ, ప్రకాష్ రెడ్డి,వర్క్ ఇన్స్పెక్టర్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# భిన్నత్వంలో ఏకత్వం

▶▶ అన్ని రాష్ట్రాల అభ్యర్థులతో ఎస్కీ లో శిక్షణ అందమైన వాతావరణం

▶▶ ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు వెల్లడి





హైదరాబాద్ మేజర్ న్యూస్( సిటీ ప్రతినిధి):ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా లోని అన్ని లెక్చర్ హాల్స్ వివిధ డివిజన్స్ నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలకు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన అభ్యర్థులతో కాలేజ్ క్యాంపస్ మొత్తం నిండిపోయి సమైక్య భారతావని కనిపిస్తున్నదని కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు అన్నారు. బుధవారం 20 ఆగస్టు, 2025 న ముగిసిన సైబర్ సెక్యూరిటీ ఇన్ పవర్ సెక్టార్ సందర్భంగా అయన మాట్లాడుతూ కాలేజ్ లోని ఐటీ డివిజన్ , మేనేజిమెంట్ అండ్ టెక్నాలజీ , క్వాలిటీ అండ్ ప్రొడక్షన్, డిజైన్ అండ్ ప్రోటో టైపింగ్, పవర్ అండ్ ఎనర్జి, సివిల్ ట్రాన్స్ పోర్టేషన్ ఇంజనీరింగ్ తదితర డివిజన్స్ ఏర్పాటుచేసిన సైబర్ సెక్యూరిటీ ఇన్ పవర్ సెక్టార్, స్ట్రాటజిక్ మేనేజిమెంట్ అండ్ ఫైనాన్సియల్ అక్యుమెన్, లీన్ సిక్స్ సిగ్మా గ్రీన్ బెల్ట్, ఇంజనీరింగ్ డిజైన్ యూసింగ్ సాలిడ్ వర్క్స్ , రెనెవిబుల్ ఎనేర్జి టెక్నాలజీస్, ఎనర్జి పోర్ట్ ఫోలియో మేనేజిమెంట్, డిజిటల్ ల్యాండ్ సర్వే మొదలైన కోర్సులకు భారతదేశంలోని సుమారు అన్ని రాష్ట్రాలనుండి శిక్షణ నిమిత్తం వచ్చిన అభ్యర్థులతో భిన్నత్వంలో ఏకత్వం గా ఒక ఫ్యాన్ ఇండియా వాతావరణం ఎస్కీ ఆవరణలో కనిపిస్తున్నదని డైరెక్టర్ అన్నారు.

అలాగే, కాలేజ్ లోని సెంటెనరీ కన్వెన్షన్ సెంటర్ లో జరుగుతున్న అంతర్జాతీయ సమావేశం హెల్తీ బిల్డింగ్స్ –2025 సందర్భంగా విచ్చేసిన విదేశీ అతిథులతో కూడా ప్రపంచం ఒక రంగస్థలం లాగా భారతదేశంలోని అన్ని రాష్ట్రాల అభ్యర్థులతో పాటుగా, విదేశీయులు కూడా ఈ ఆవరణలో తిరుగుతుండటం వలన ఒక నూతన వాతారవరణం ఏర్పడిందని, ఒకేసారి ఇన్ని సమావేశాలు ఏర్పాటుచేసిన వివిధ హెడ్స్ ఆఫ్ ది డిపార్టుమెంట్ , ఫ్యాకల్టీ లకు డాక్టర్ రామేశ్వర్ రావు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. హెల్తీ బిల్డింగ్స్ –2025 కోసం ఏర్పాటుచేసిన అన్ని సెమినార్ హాల్స్,లెక్చర్ హాల్స్, ఆడిటోరియం అన్నీ కూడా దేశ, విదేశీ డెలిగేట్స్ తో నిండిపోవడం ఆనందంగా ఉందన్నారు.

**తంగిరాల సంతాప సభ**




ముషీరాబాద్ మేజర్ న్యూస్ : ఎస్ వీ కే లో తంగిరాల చక్రవర్తి కవి రచయిత విమర్శకులు నాటక ప్రయోక్త సంతాప సభ జరిగింది. తెలంగాణ సాహితీ స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో ఆనందా చారి ఈ సభను నిర్వహించారు. పద్మశ్రీ ఐనాక్ మోహన కృష్ణ సలీమ సత్య భాస్కర్ నందిని సిధారెడ్డి రాపోలు సుదర్శన్ కందేపి మిద్దె సురేష్ . స్కైలాబ్ బాబు తంగళ్లపల్లి తదితరులు తంగిరాలకు నివాళ్ళు అర్పించారు.

# సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోండి : మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



మల్కాజిగిరి, మేజర్ న్యూస్ : సీఎంఆర్ఎఫ్ ను అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్య చికిత్స కోసం సీఎంఆర్ ఎఫ్ కు దరఖాస్తు చేసుకున్న మౌలాలి డివిజన్ కు చెందిన షేక్ రషీద్ కు రూ 36,000, షేక్ కైరునిస కు రూ 38,000 మంజూరైన చెక్ లను గురువారం లబ్ధిదారులకు మైనంపల్లి హన్మంతరావు పంపిణీ చేశారు. ఈ సందర్భం గా బాధితులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సహకరించిన మైనంపల్లి హన్మంతరావుకు, మౌలాలి 138 డివిజన్ ప్రెసిడెంట్ పోతుల వినోద్ యాదవ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మల్కాజి గిరి నియోజకవర్గం ఇన్ ఛార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి, మౌలాలి 138 డివిజన్ ప్రెసిడెంట్ పోతుల వినోద్ యాదవ్, సీనియర్ నాయకులు హమీద్, వెంకటేష్, అఫ్రోజ్, షకీల్, సలీమ్, భాగ్యారాణి, నరసింహ, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేతుల మీదుగా స్టూడియో ప్రారంభం



కర్మన్ ఘాట్ , మేజర్ న్యూస్ :లింగోజిగూడ డివిజన్ పరిధిలోని మైత్రి నగర్ కాలనీ లో డివిజన్ భారస పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ ఠాగూర్ ,సుధీర్ ఠాగూర్ లు నూతనంగా నెలకొల్పిన వారాహి ఎంటర్ ప్రైజెస్ లిటిల్ స్టూడియో ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఇట్టి స్టూడియో నందు చిన్నారుల ఫోటో షూట్ కోసం వివిధ రకాల సినిమా సెట్టింగులు ఎర్పాటు చేయడం జరిగిందని, ఫోటో షూట్ కోసం వచ్చే వినియోగదారులకు నామమాత్రపు రుసుముతో సేవలంది వారి మండల తో వ్యాపారంలో మృతి చెందాలని నిర్వాహకులు సూచించారు .ఇట్టి కార్యక్రమంలో భారస పార్టీ సీనియర్ నాయకులు,ఉద్యమకారులు,పలు విభాగాల అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు,మహిళలు,పార్టీ కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో లేడీస్ కార్నర్ దగ్ధం

**- భారీగా ఆస్తి నష్టం - ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం**

**అందేలా కృషి చేస్తా : కార్పోరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి**



కర్మన్ ఘాట్ ,మేజర్ న్యూస్ :ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ శుభోదయ కాలనీ లో కిరాణం మరియు లేడీస్ కార్నర్ షాప్ లో భారీ అగ్ని ప్రమాదం సంభవించిన విషయం తెలుసుకున్న వంగ మధుసూదన్ రెడ్డిసంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ అధికారులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు.

చంపపేట్ డివిజన్ శుభోదయ కాలనీలో గత పది సంవత్సరాలుగా ఎరుకల లావణ్య గౌడ్ శ్రీనివాస్ దంపతులు శివాని లేడీస్ కార్నర్ మరియు కిరాణా షాప్ ను నడుపుతున్నారని, మధ్యాహ్నం భోజనం ఇంటికి వెళ్లగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా షాపు దగ్ధమైందని తెలిపారు. ఈ విషయం తెలుసుకొని వెంటనే అక్కడికి చేరుకొని పరిశీలించి బాధ్యత కుటుంబ సభ్యులను పరామర్శించారు . ప్రభుత్వ నుండి ఆర్థిక సహాయం అందే విధంగా కృషి చేస్తానని తెలిపారు.సుమారు ఐదు లక్షల విలువగల కిరాణం స్టేషనరీ కుట్టు మిషన్లు బట్టలు వ్యాపారానికి సంబంధించిన సామాన్లు దగ్ధం కాగా 1,80,000 నగదు ఒక తులం బంగారు కమ్మలు ఉన్నట్లు బాధితులను తెలిపినట్లు తెలిపారు.

## బీఆర్ఎస్‌లో యువకులు చేరిక



మల్కాజిగిరి, మేజర్ న్యూస్ : నేరేడ్ మెట్ జేజే నగర్‌కు చెందిన పలువురు యువకులు గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో సాయి, విజయ్, మధు రాకేష్, ప్రవీణ్ కుమార్, సన్నీ, నాని, కిట్టు తదిత రులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, సదరు యువకుల మెడలో గులాబీ కండువా వేసి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీలో కొత్తగా చేరిన యువకులు మల్కా జిగిరి నియోజకవర్గం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సాయి, విజయ్, మధు రాకేష్, ప్రవీణ్ కుమార్, సన్నీ, నాని, కిట్టు మాట్లాడుతూ, మల్కా జిగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి చేస్తున్న అభి వృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై తాము బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నేరేడ్ మెట్ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు నరేష్, నవీన్, రాజు, మధుసూదన్ రెడ్డి, రాజశేఖర్, విక్రమ్ గౌడ్,రమేష్, రాజు, అరవింద్ పాల్గొన్నారు.

## ఎన్ఐపీఎం హైదరాబాద్ చాప్టర్ ఛైర్మన్‌గా 'చిక్కాల'



హైదరాబాద్, మేజర్ న్యూస్ : భారతదేశంలోని ప్రఖ్యాత మానవ వనరుల సంస్థ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్, వెర్చ్ కన్సల్టింగ్ ఎల్ఎల్పీ సీఈఓ డాక్టర్ చిక్కాల వేణు గోపాల్ రావును ఆ సంస్థ హైదరాబాద్ చాప్టర్ ఛైర్మన్‌గా నియమించింది. ఆయనకు ఫార్మా, ఐటీ రంగాలలో రెండు దశాబ్దాలకు పైగా అనుభవం కలదు. ఈ సంస్థలో వివిధ స్థాయిల్లో విశిష్ట సేవలందించారు. హ్యూమన్ రిసోర్సెస్, ఇండస్ట్రియల్ రిలేషన్స్‌లో విస్తృత పరిజ్ఞానం ఉంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ చాప్టర్ ఛైర్మన్‌గా నియమితులు కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ చాప్టర్ ను సదస్సులు, వర్క్‌షాప్‌లు, కాన్ఫరెన్స్‌లు, జ్ఞాన వేదికల ద్వారా ప్రొఫెషనల్ కమ్యూనిటీని శక్తివంతం చేయడానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. తద్వారా ఆధునిక హెచ్‌ఆర్, ఐఆర్ పద్ధతులపై అవగాహన కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎన్ఐపీఎం జాతీయ అధ్యక్షుడు ఎంహెచ్ రాజా, కార్యదర్శి పీఆర్ బసవరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

## కార్మికుల హక్కుల కోసం పోరాడుదాం



హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : సంఘటిత, అసంఘటిత కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తామని తెలంగాణ కార్మిక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు కలికోట రామన్న పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అవ్వాలంటే చట్టసభల్లో అడుగు పెట్టాలని కోరారు. పనికి తగ్గ వేతనం కల్పించాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లను అందజేయాలని కోరారు. పారిశుద్ధ కార్మికుల వేతనాలు రూ. 30 వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి కార్మికుడికి మూడు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు పథకంతో కుదేలైన ఆటో కార్మికులకు రూ 50 వేల ఆర్థిక సహాయం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి బందెల యాదగిరి, మహిళా అధ్యక్షురాలు సుజాత, వివిధ రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నాట్య ప్రతిభ..!!



ముషీరాబాద్ మేజర్ న్యూస్ : తమిళనాడు మదురై రామేశ్వరం లో జరిగిన అక్షయ సోషల్ కల్చరల్ అసోసియేషన్ వారి అద్వర్యం లో గురువులు జీవీ మోహన్ ఆచార్య ప్రతిభ వేంపల్లి హసీనా యమునా దేవులపల్లి దివ్య యండమూరి తులసి ఆడపా నరేష్ తాళ్లపల్లి ప్రవల్లిక వివిధ ప్రాంతాల నుండి తమ శిష్యులతో ప్రదర్శనలు ఇచ్చారు.వీరి ప్రదర్శనకు మెచ్చి సంస్థ వారి గురువులను సత్కరించడం జరిగింది మరియు చిన్నారులకు ప్రశంస పత్రం మరియు బహుమతులు అందజేయడం జరిగింది

అక్షయ సోషల్ కల్చరల్ అసోసియేషన్ అధినేత సీహెచ్ సీతారాం భవాని ప్రతి ఒకరిని ప్రశంసించారు.ఇంత సహాయ సహకారాలు అందించిన ప్రతి గురువుకి,శిష్యులకి, ముఖ్యంగా పిల్లల తల్లీ తండ్రులకు సంస్థ తరఫున ధన్యవాదాలు తెలుపుకుంటున్నారు.ఈమేరకు నిర్వాకులు ఓ ప్రకటనలో తెలిపారు.

## ఆలోచనలకు నిర్మాణ వాస్తవికత ఎలా?

**ఆచరణాత్మక అభ్యాస అనుభవాన్ని పొందిన గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు**





హైదరాబాద్, మేజర్ న్యూస్ ప్రతినిధి: డిజైన్ భావనలు ఆలోచనల నుంచి నిర్మాణ వాస్తవికతగా ఎలా రూపాంతరం చెందుతాయో గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. సికింద్రాబాదులోని ప్రముఖ ఆర్కిటెక్ట్ ఒకరి నివాసాన్ని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ మూడో సెమిస్టర్ విద్యార్థులు ఇటీవల సందర్శించి ఒక ప్రత్యేకమైన అనుభవపూర్వక అభ్యాసాన్ని నిర్వ హించారు.ప్రత్యక్ష కేస్ స్టడీగా పనిచేసిన ఈ సందర్శనలో వాతావరణ-స్పందనాత్మక రూపకల్పన, సమర్థవంతమైన ప్రాదేశిక ప్రణాళిక, నిర్మాణ సామగ్రిని వినూత్నంగా వినియోగించిన తీరు, నిర్మాణ వివరాల యొక్క సూక్ష్మ నైపుణ్యాలతో పాటు నిర్మాణ సాధనలోని కీలకమైన అంశాలను విద్యార్థులు నిశి తంగా పరిశీలించి, అర్థం చేసుకున్నారు. ఆలోచనాత్మకం గా రూపొందించిన ప్రదేశాలలో కలియ తిరగడం, వాస్తుశిల్పితో ముఖాముఖి మాట్లాడటం వల్ల డిజైన్ భావనలు నిర్మాణ వాస్తవికతగా ఎలా రూపాంతరం చెందుతాయో విద్యా ర్థులు స్వయంగా తెలుసుకున్నారు.తమ పరిశీలనలను విద్యార్థులు స్కెచ్ పుస్త కాలలో నమోదు చేసి, తరగతి గది నుంచి సైద్ధాంతిక జ్ఞానాన్ని ఆన్-సైట్ విశ్లేష ణలోకి అనువదించారు. ఈ లీనమయ్యే అనుభవం విద్యార్థుల సాంకేతిక అవగాహనను మరింతగా పెంచడమే కాకుండా,నిర్మాణ సాధనను రూపొందించే సృజనాత్మక,సందర్భోచిత కోణాల ను అభినందించేలా వారిని ప్రేరేపించింది. ఆలోచనల పరస్పర మార్పిడితో సాగిన ఈ సందర్శలో విద్యార్థులు తమ అవగాహన ను మరింత పెంపొందించుకోవడంతో పాటు, వాస్తుశిల్పాన్ని ప్రత్యక్షంగా చూసినప్పుడు మరింత బాగా నేర్చుకోవచ్చునే వాస్తవాన్ని మరోమారు రుజువు చేశారు.

# జిహెచ్ఎంసి పరిధిలో జరిగే అక్రమ కట్టడాలను అడ్డుకుంటాం : దళిత చైతన్య సంఘం నేతల



హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : జిహెచ్ఎంసి పరిధిలో ఉద్యోగుల అండతో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను అడ్డుకుంటామని దళిత చైతన్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ వెల్లడించారు. ఈ మేరకు గురువారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సభ్యులు తీగల శివకుమార్, మధుసూదన్ రావు, చిలకపాటి సుశీల్రాజ్, బి నవీన్ కుమార్ లతో కలిసి ఆయన మాట్లాడారు. జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు, చైన్ మెన్ల అవినీతి కారణంగా అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా సాగుతున్నాయన్నారు. చైన్ మెన్ లు భవన యజమానులకు సహకరిస్తూ లక్షలాది రూపాయలు అడ్డగోలుగా సంపాదిస్తున్నారని తెలిపారు. సికింద్రాబాద్, బేగంపేట పరిధిలోని 8 మంది చైన్ మెన్ల పై జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ కు ఇటీవల ఫిర్యాదు చేశామన్నారు. వీరిని కమిషనర్ చార్మినార్ ప్రాంతానికి బదిలీ చేసినట్లుగా చెప్పారు. 20 ఏండ్లుగా జిహెచ్ఎంసి కి చెందిన పలు విభాగాల అధికారులు ఒకే చోట తిష్ట వేసి అవినీతికి పాల్పడుతున్నట్లుగా వెల్లడించారు. ఒక ఉద్యోగి 2 సంవత్సరాలకు మించి ఒకే చోట పని చేయకూడదని నిబంధనను వీరు అతిక్రమిస్తున్నట్లుగా చెప్పారు. ఇటువంటి అధికారుల జాబితాను కమిషనర్ కు అందించనున్నట్లు తెలిపారు. జిహెచ్ఎంసి లో పలువురు అవినీతి అధికారులు కోట్లకు పడగలెత్తినట్లుగా చెప్పారు. జిహెచ్ఎంసి లోని అవినీతి అధికారులను బదిలీ చేసేంతవరకు తాము పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

# విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి : కార్పొరేటర్ శ్రవణ్



మల్కాజిగిరి, మేజర్ న్యూస్: గణేష్ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా, ఎటువంటి ప్రమాదాలు జరగ కుండా సంబంధిత అధికారులు ముందస్తుగా భద్రతా ప్రమాణాలపై దృష్టి సారించాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ సూచించారు. గురువారం ఆయన శివపురి లోని తన కార్యాలయంలో ట్రాన్స్ కో డిఈ అన్వర్ పాషా, ఏడిఈ చంద్రశేఖర్, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా కార్పొరేటర్ శ్రవణ్ మాట్లా డుతూ, సఫిల్ గూడ చెరువు వెనుక గేట్ పక్కన ట్రాన్స్ ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనేక చోట్ల వంగి పోయి ఉన్న విద్యుత్ ఐరన్ పోల్స్ మార్చాలని కోరారు. గత సమావేశం లో చెప్పిన పనులలో వినాయక్ నగర్ సెక్షన్ తప్ప, మిగిలిన చోట్ల పనులు జరిగాయని, వినాయక్ నగర్ సెక్షన్ లో సైతం వెంటనే పనులు పూర్తి చేయాలని కోరారు. పోల్స్ పై వైర్ లు తీసేటప్పుడు ఇంటర్నెట్ సేవలు దెబ్బ తినకుండా చూడాలని కోరారు. ఈ విషయమై ముందస్తుగా పత్రికల ద్వారా ప్రజలకు సమాచారం అందజేసిన తరువాత వైర్ లు తొలగించాలన్నారు. దీనికి అధికారు లు సానుకూలంగా స్పందించారు. వెంటనే ఆయా పనులు పూర్తి చేస్తామని కార్పొరేటర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఇ శ్రీని వాస్, నాయకులు నందుయాదవ్, మురళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి కేరాఫ్గా కూకట్ పల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్

### అక్రమ నిర్మాణం పై జోనల్ కమిషనర్కు ఫిర్యాదు చేసిన స్థానికుడు బొట్టు విష్ణు

కూకట్ పల్లి మేజర్ న్యూస్ : జిహెచ్ఎంసి కూకట్ పల్లి సర్కిల్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న భవన నిర్మాణంపై బుధవారం స్థానికుడు బొట్టు విష్ణు కూకట్ పల్లి జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని దయార్ గూడ 5- 6- 74 లో తక్కువ స్థలంలో ఆకాశాన్నంటే రీతిలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, తద్వారా ట్రాఫిక్, తాగునీటి, డ్రైనేజీ సమస్యలు ఏర్పడుతున్నాయని ఫిర్యాదులో తెలియజేశారు. వెంటనే సదరు నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలంటూ కోరారు. అక్రమ నిర్మాణాలపై జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. జిహెచ్ఎంసి అధికారులు బాధ్యత లేకుండా వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని అన్నారు. ఇప్పటికైనా ఉన్న అధికారులు ఈ భవనంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# ఎమ్మెల్యే దేవిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎఫ్.సి.ఐ కాలనీ వాసులు

▶▶ జలమయమైన మెయిన్ రోడ్డు సమస్యను వివరించిన కాలనీ వాసులు ▶▶ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే



వనస్థలిపురం, మేజర్న్యూస్:ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్.సి.ఐ కాలనీ మెయిన్ రోడ్డులో వర్షపు నీరు చేరి జలమంయగా మారడంతో కాలనీ వాసులు సమస్యను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్రెడ్డికి దృష్టికి తీసుకువెళ్లారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కాలనీ వాసులు సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్, కాలనీ అధ్యక్షులు నర్సింహ్మారావు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, కోశాధికారి సత్యనారాయణ, రాజు యాదవ్, కృష్ణారావు, రాజేశ్వర్రావు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ముషీరాబాద్కు ప్రెస్ క్లబ్ కావాలి!

ముషీరాబాద్ మేజర్ న్యూస్ :నగరంలో ముషీరాబాద్ నియోజకవర్గం రాజకీయంగా కల్చరల్ గా విద్యాపరంగా కీలకమైంది.నగరంలో ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్లో అధిక శాతం ప్రెస్ క్లబ్ లు ఉన్నాయి.స్థానిక ప్రజా ప్రతినిధులు నియోజక వర్గం రిపోర్టర్స్ కు సహకరించి ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు ముందుకు రావడం జరుగుతుంది.స్థానిక కమ్యూనిటీ హాల్ లో ఇతర ప్రైవేట్ భవనాల్లోనూ ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు సమ్మతిస్తున్నారు.అదే విధంగా ముషీరాబాద్ నియోజక వర్గం లో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులు ముందుకు రావాలి..స్థానిక జర్నలిస్టులు ఈమేరకు కోరుతున్నారు ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని జర్నలిస్టులు కోరుతున్నారు.

# ప్రత్యేక వృద్ధాప్య సంరక్షణ కొరకు కేర్ హాస్పిటల్స్ ఎమోహా భాగస్వామ్యం




### వైద్య నైపుణ్యాన్ని సమగ్ర మద్దతుతో వృద్ధుల జీవితాలను సంతోషకరం చేస్తోంది

హైదరాబాద్,మేజర్ న్యూస్ ప్రతినిధి: ప్రపంచ సీనియర్ సిటిజన్స్ దినోత్సవం సందర్భంగా, కేర్ హాస్పిటల్స్, దేశంలోని ప్రముఖ వృద్ధుల సంరక్షణ సంస్థ ఎమోహా తో కలిసి,హైదరాబాద్లో వృద్ధుల సంరక్షణలో కొత్త దిశ చూపే ఒక ముఖ్యమైన భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా వృద్ధులకు వైద్యపరంగా మాత్రమే కాకుండా,భావోద్వేగపరంగానూ తోడ్పాటు అందించే పూర్తి స్థాయి సంరక్షణ వ్యవస్థ ను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి తల్లి, తండ్రి సురక్షితంగా, ఆదరణగా, శ్రద్ధగా ఉండేలా చూసే దిశగా ఇది ఒక పెద్ద ముందడుగు కానుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా అక్టోబర్ 1న హైదరాబాద్లోని కేర్ హాస్పిటల్స్లో అత్యాధునిక జెరియాట్రిక్ కేర్ ఫెసిలిటీ ప్రారంభం కానుంది. వృద్ధుల ప్రత్యేక అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ యూనిట్లో సమగ్ర వృద్ధాప్య సమస్యల అంచనా నుండి ఆధునిక వైద్య చికిత్స ల వరకు అన్ని సేవలు అందించబడతాయి. ఈ భాగస్వామ్యం వల్ల ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యే వృద్ధులకు ఇంట్లోనే నిపుణుల వైద్య సహాయం,కరుణతో కూడిన సంరక్షణ అందుతుంది. దీంతో తిరిగి అనారోగ్యం పాలయ్యే ప్రమాదం,మళ్లీ ఆసుపత్రిలో చేరే అవసరం, భావోద్వేగ క్షోభలు తగ్గుతాయి. ఎమోహా శిక్షణ పొందిన కేర్టేకర్లు, నర్సులు, సంరక్షణ బృందం ముందుకు వచ్చి మందులు ఇవ్వడం, ప్రాణాధారాలను చెక్ చేయడం, రోజువారీ ఆరోగ్య అవసరాలు తీర్చడం వంటి సేవలు అందిస్తారు. దీంతో వృద్ధులు తమ ఇళ్లలోనే సౌకర్యంగా, సురక్షితంగా కోలుకునే అవకాశం పొందుతారు. సంరక్షణలో భావోద్వేగం కూడా అంతే ప్రధానమైనది. ఎమోహా యాప్ ద్వారా పెద్దలు దేశవ్యాప్తంగా ఉన్న సీనియర్ కమ్యూనిటీతో ఎప్పుడూ కనెక్ట్ అయి ఉంటారు. ఆన్లైన్ ప్రోగ్రాంలు,ఇంటరాక్టివ్ సెషన్లు, ప్రత్యేకం గా ఏర్పాటు చేసిన ఈవెంట్లు వీరిని ఉత్సాహంగా, ఆనందంగా ఉంచుతాయి. ఎమోహా కమ్యూనిటీ-ఫస్ట్ విధానం, స్థానిక స్థాయిలో ఉన్న సహకారం వల్ల పెద్దలు ఎప్పుడూ ఒంటరిగా ఉండరు. వారు తమ కుటుంబాలతో పాటు సమాజంలో చురుకు గా, కలిసిమెలిసి,విలువైన వారిగా కొనసాగుతారు. కేర్ హాస్పిటల్స్ జోనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బిజు నాయర్ మాట్లాడుతూ,కేర్ హాస్పిటల్స్లో మేము ఎప్పుడూ సమగ్ర ఆరోగ్య సేవలను,ప్రజల మారుతున్న అవసరాలకు తగ్గట్టుగా అందించడాన్ని నమ్ముతాం. ఎమోహా తో ఈ కొత్త అనుబంధం వృద్ధుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఉంది. మా క్లినికల్ నైపుణ్యాన్ని, వృద్ధులకు అవసరమైన అన్ని రకాల సహకారాన్ని అందించే పూర్తి స్థాయి వ్యవస్థతో కలపడం ద్వారా సీనియర్ సిటిజన్ల పట్ల మా నిబద్ధతను మరింత బలపరిచాం. ఈ సహకారం వృద్ధాప్య సంరక్షణలో మా సేవలను విస్తరించడమే కాకుండా, సీనియర్లు విలువైనవారిగా, సురక్షితం గా ఆదరణ పొందే వాతావరణాన్ని సృష్టించడానికి దోహదపడుతుందని తెలిపారు.వృద్ధులను చూసుకోవడం అంటే కేవలం అనారోగ్యానికి చికిత్స చేయడం మాత్రమే కాదు.వారు గౌరవంగా, భద్రతతో, ఆనందంగా జీవించేలా చూడటం కూడా అంతే ముఖ్యమైంది. కేర్ హాస్పిటల్స్తో కలిసి, మేము ఒకే విశ్వసనీయ అంబరంలో శారీరక సంరక్షణతో పాటు భావోద్వేగ మద్దతు కలిసిన సంపూర్ణ వాతావరణాన్ని అందిస్తున్నామని ఎమోహా ఎల్డర్కేర్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు సౌమ్యజిత్ రాయ్ తెలిపారు.హైదరాబాద్లో వృద్ధుల కోసం అత్యంత సమగ్రమైన సంరక్షణ వాతావరణాన్ని నిర్మించే దిశగా ఎమోహా, కేర్ హాస్పిటల్స్ కలిసి కీలకమైన అడుగు వేస్తున్నాయి. ఎందుకంటే "టుగెదర్ వి కేర్ %-% టుగెదర్ వి పుట్,

# మహీంద్రాలో సాంస్కృతిక చైతన్యం

**- 'రూట్' పేరుతో సరికొత్త ఈవెంట్‌కు నాంది - వర్సిటీ సర్వేలో సంస్కృతిని సృజనాత్మకంగా పునర్నిర్వచించాలని వెల్లడి**




హైదరాబాద్, మేజర్ న్యూస్: భారతీయ సంగీత సంప్రదాయాలు, జానపద కళలు, శాస్త్రీయ సంగీతం బావి తరాలకు అందించడమే లక్ష్యంగా మహీంద్రా విశ్వవిద్యాలయంలో సరికొత్త ఈవెంట్‌కు నాంది పలికారు. ఈ కళలను భవిష్యత్తు తరాలకు సరికొత్తగా పరిచయం చేసేందుకు 'రూట్స్ ఎట్ మహీంద్రా యూనివర్సిటీ' పేరుతో ఈ కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను శుక్రవారం వర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహీంద్రా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ యజులు మేడూరి మాట్లాడుతూ నవంబర్లో ఈ గ్రాండ్ ఈవెంట్ నిర్వహించనున్నామని చెప్పారు. విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయడం, భవిష్యత్తు దృష్టి కోణం తమ లక్ష్యమన్నారు. ఆ దిశలో రూట్స్ ఉత్సవం విద్యార్థులకు మరచిపోయిన కళలను ముందుకు తీసుకెళ్లే అద్భుతమైన అవకాశాన్ని ఇస్తోందన్నారు.. ఈ ఉత్సవాన్ని విద్యార్థుల కోసం, విద్యార్థులే నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ ఉత్సవం కేవలం మన గతాన్ని కాపాడటం మాత్రమే కాదని, భవిష్యత్తు తరాలకు దాన్ని సమకాలీనంగా మార్చి అందించడం కూడా అన్నారు. ఇది విద్యార్థులకు ఎప్పటికీ గుర్తుండిపోయే ఒక జ్ఞాపకంగా నిలుస్తోందని తెలిపారు. ఈ ఉత్సవం విద్యార్థులలో నాయకత్వం లక్షణాలు, సాంస్కృతిక రంగంలో వివిధ బాధ్యతలు చేపట్టేలా తయారు చేస్తోందని పేర్కొన్నారు. మహీంద్రా యూనివర్సిటీలోని విద్యార్థుల్లో ఉన్న ఈ తపనను సాకారం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. కేవలం సంప్రదాయాలను కాపాడటం మాత్రమే కాకుండా, వాటిని సృజనాత్మకంగా పునరావిష్కరించి, ఆధునిక స్వరాలతో, డిజిటల్ వేదికలతో కలిపి కొత్త రూపంలోకి తీసుకురావడమే దీని ఉద్దేశ్యం. ఇది జెన్-జెడ్ తరం తమ మూలాలను గౌరవిస్తూ, అంతర్జాతీయ ప్రమాణాలకు సరిపడే సాంస్కృతికంగా చైతన్యవంతమైన భవిష్యత్తును నిర్మించాలనే ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తుంది. ఇందులో సంగీత సంప్రదాయాలు మళ్లీ జీవం పొందుతాయి. జానపద సంగీతం, శాస్త్రీయ సంగీతం, ఇతర లోతైన కళారూపాల ద్వారా అపూర్వమైన కథలు ప్రతిధ్వనిస్తాయి. భారతీయ సంగీత వారసత్వాన్ని కాపాడుతూ, అభివృద్ధి చేసుకోవడంలో విద్యార్థులు కేవలం ప్రేక్షకులుగా కాకుండా భాగస్వాములుగా మారే విధంగా ప్రోత్సహిస్తుంది. ఈ వేడుకను మహీంద్రా యూనివర్సిటీలో ఆధునిక సౌకర్యాలతో కూడిన క్యాంపస్‌లోని వివిధ ప్రాంగణాలలో ఆవిష్కృతం కానుంది. ప్రత్యేకంగా రూపుదిద్దిన వేదికలు, అద్భుతమైన అలంకరణలు, స్థానిక పాప్-అప్‌ల ద్వారా క్యాంపస్ ఒక సాంస్కృతిక కేంద్రంగా మారనుంది. భారతదేశం నలుమూలల నుంచి వచ్చే వివిధ సంగీత కళాకారులు ప్రేక్షకులను అలరించనున్నారు. ఇది ఒక అద్భుతమైన సంగీత యాత్రగా మారుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

## మార్వాడీ సమాజ ద్వేషకులపై చర్యలు తీసుకోవాలి

**డీజీపీని కోరిన తెలంగాణ అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా**



హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : ఆమన్‌గల్‌లో మార్వాడీ సమాజంపై విద్వేష ప్రసంగాలు, రెచ్చగొట్టే చర్యలకు వ్యతిరేకంగా తక్షణమే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని డీజీపీ కి తెలంగాణ అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అగర్వాల్, మార్వాడీ సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అపెక్స్ బాడీ అయిన అగర్వాల్ సమాజ్ తెలంగాణ తరపున వినతి పత్రం అందజేశారు. ప్రశాంత రాష్ట్రంలో సామాజిక సామరస్యాన్ని, శాంతిభద్రతలను, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ఒక తీవ్రమైన ఆందోళనకరమైన విషయాన్ని మీ తక్షణ దృష్టికి తీసుకు వస్తున్నట్టు చెప్పారు . ఇటీవల తమ సమాజంలోని సభ్యులను లక్ష్యంగా చేసుకుని విద్వేషపూరిత నినాదాలు, బెదిరింపులకు పాల్పడిన కొన్ని తీవ్రమైన సంఘటనలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో అంజనీ కుమార్ అగర్వాల్, రూపేష్ కుమార్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# 23 వారాల్లో పుట్టిన శిశువును ఆరోగ్యంగా డిశ్చార్జ్

**విజయవంతం చేసిన మెడికవర్ వైద్య బృందం**



హైదరాబాద్, మేజర్ న్యూస్ ప్రతినిధి: హైదరాబాద్ లోని మెడికవర్ ఉమెన్,చైల్డ్ హాస్పిటల్స్, నియోనాటల్ వైద్యంలో ఒక అద్భుత మైన పురోగతిని సాధించింది. కేవలం 23 వారాల గర్భధారణతో పుట్టిన శిశువును విజయవంతంగా డిశ్చార్జ్ చేసింది. ఇంత తక్కువ సమయంలో పుట్టిన శిశువులు బతకడం ప్రపంచ వ్యాప్తంగా చాలా అరుదు,ఇది భారతీయ నియోనాటల్ ఆరోగ్య సంరక్షణలో ఒక చారిత్రాత్మక విజయం. ఏప్రిల్ 18, 2025న జన్మించిన ఈ ఆడ శిశువు, పుట్టినప్పుడు కేవలం 565 గ్రాముల బరువు ఉంది .ఆమెను వెంటనే నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో చేర్చారు. ఆమె చికిత్సలో 6 రోజులు వెంటిలేషన్,78 రోజులు బబుల్ సీపాప్, హెచ్ఎఫ్ఎన్సి సపోర్ట్, చిన్నపాటి ఇన్ఫెక్షన్లకు చికిత్స,బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ లు,గుండె, మెదడు, రెటీనా అభివృద్ధిని నిరంతరం పర్యవేక్షించడం వంటివి ఉన్నాయి. గుండె సంబంధిత సమస్య (పేటెంట్ డక్టస్ ఆర్టెరియోసస్)కు మందులతో విజయవంతంగా చికిత్స అందించారు. తదనంతరం నిర్వహించిన పరీక్షల్లో ఆమె ఆరోగ్యకరమైన పురోగతిని ధృవీకరించారు.శిశువుకు 15వ రోజు నుండి పూర్తిస్థాయిలో ఆహారం అందించడం ప్రారంభించారు.115 రోజుల పాటు ఇంటెన్సివ్ కేర్ తరువాత,ఆగస్టు 11 2025 న ఆమెను 2కిలోల బరువుతో,స్థిరమైన ఆరోగ్యం తో, అన్నింటికంటే ముఖ్యంగా, ప్రిమెచ్యూర్ కాంప్లికేషన్లు లేకుండా డిశ్చార్జ్ చేశారు. డాక్టర్ రవీందర్ రెడ్డి పరిగే, చీఫ్ కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్ మాట్లాడుతూ,"23 వారాలకు పుట్టిన శిశువు బతకడం చాలా అరుదైన, అద్భుతమైన విజయం. దీనికి నిరంతర పర్యవేక్షణ, అధునాతన నియోనాటల్ చికిత్సలు బృందాల మధ్య అత్యున్నత సమన్వయం అవసరం. ఈ ఫలితం, నైపుణ్యం, సాంకేతికత కరుణతో కూడిన సంరక్షణ తో ఒకప్పుడు అసాధ్యం అనిపించిన వాటిని కూడా మనం సాధించగలమని నిరూపిస్తుంది."డాక్టర్ రాధిక, కన్సల్టెంట్ అబ్స్టెట్రిషియన్ మరియు గైనకాలజిస్ట్ మాట్లాడుతూ,"తల్లి వైపు నుండి చూస్తే,ఈ ప్రయాణం నియోనాటల్ సంరక్షణతో సమానంగా కీలకమైనది. ముందస్తు జోక్యం, నిరంతర పర్యవేక్షణ,అబ్స్టెట్రిక్స్, నియోనాటాలజీ బృందాల మధ్య సమన్వయం శిశువు బతకడానికి ఆమె ఆరోగ్యకరమైన డిశ్చార్జ్‌కు పునాది వేశాయి. ఇది బృందాల మధ్య సహకారం అంకిత భావానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవిత, డాక్టర్ వంశీ రెడ్డి, డాక్టర్ ప్రశాంతి, సిబిల్ థామస్ (ఎన్ఐసీయూ హెడ్ నర్స్), సెంటర్ హెడ్ ప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్ ఉన్నారు.శిశువు కవల సోదరి ఊపిరితిత్తుల సమస్యల కారణంగా తొమ్మిదవ రోజున దురదృష్టవశాత్తు మరణించిన ప్పటికీ, ఈ విజయవంతమైన ఫలితం భారతదేశం లో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నియోనాటల్ సంరక్షణ ఆవిష్కరణలకు మెడికవర్ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది అని తెలిపారు.

## అశ్వంత్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు



కూకట్ పల్లి మేజర్ న్యూస్ : తెలంగాణ రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ అశ్వంత్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ

సందర్భంగా బంజారా హిల్స్ లోని బసవతారకం కాన్సర్ హాస్పిటల్ ప్రాంగణంలో క్యాన్సర్ వ్యాధి బాధితులకు వారి 250 కుటుంబాలకు ఆహారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్ ఆయురారోగ్యలతో అష్ట ఐశ్వర్య లతో ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భవిష్యత్ లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు జోగు కిరణ్, కట్ట శ్రీనివాస్, వై. రాజు, ఏ. దుర్గ ప్రసాద్, మణికంఠ, కే. వెంకట్, బబ్లు, భరత్, లోకేష్, చందు, రవి పాల్గొన్నారు.

## వినతి...



ముషీరాబాద్ మేజర్ న్యూస్ :గత సంవత్సరం 2024 జనవరి లో జీ హెచ్ ఎమ్ సీ మరియు రెవెన్యూ అధికారులు శ్రీ స్వామి వివేకానంద నగర్ బస్తి వాసుల ఇళ్లను కూల్చేశారని ఇప్పటి వరకు నిరాశ్రయులైన పేదలకు ఇళ్లు కేటాయించలేదని. వెంటనే వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాంచాలని కోరుతూ గురువారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరి చందన వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లను కూల్చి 19 నెలలు గడిచిందని.ఇప్పటి వరకు ఇళ్లు కోల్పోయి దిన స్థితిలో ఉన్న 19 దళిత కుటుంబాలకు ప్రభుత్వం ఇళ్లను కేటాయించాలని కోరుతు.. ఈ విషయంపై కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి గారు, ఎం.పి రాజ్యసభ డా"కె.లక్ష్మణ్ మరియు హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఇంచార్జి మినిస్టర్ పొన్నం ప్రభాకర్ సైతం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ గారికి ఇళ్ల మంజూరుకు లిఖితపూర్వకంగా సూచించారని కార్పొరేటర్ అన్నారు.ఇళ్లు కోల్పోయిన పేదల కష్టాలను, ఇళ్ల కేటాయింపుపై జరుగుతున్న అలస్యంపై, ప్రభుత్వం మరియు ప్రభుత్వ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని నిరాశ్రయులైన నిరుపేద కుటుంబాలకు వెంటనే నీడను కల్పించి ఆదుకోవాలని కార్పొరేటర్ కలెక్టర్ ని కోరారు.సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ .మంజూరు అయిన ఇళ్లను అతి త్వరలో కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసి పెదలను ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ గారు వివరించారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ , బస్తి వాసులు ఎం.బీ.కృష్ణ, జ్ఞానేశ్వర్,ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆనంద్ బాగ్ వెంకన్నస్వామి హుండీ లెక్కింపు

**78 రోజులకు రూ 4,33,070 ఆదాయం : ఎబి.రవీంద్ర రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి**



మల్కాజిగిరి, మేజర్ న్యూస్ : మల్కాజిగిరి పట్టణ పరిధిలోని ఆనంద్ బాగ్ చౌరస్తా సమీపంలో గల శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారికి భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఎండో మెంట్ పర్యవేక్షణ అధికారి మోహన్ రెడ్డి సమక్షంలో ఈ హుండీని లెక్కించారు. 78 రోజులకు గాను రూ 4,33,070 (నాలుగు లక్షల ముప్పైమూడు వేల డెబ్బై రూపాయలు) ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎబి. రవీంద్ర రెడ్డి చెప్పారు. హుండీ లెక్కింపులో ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వేంకట రమణాచార్యులు, అర్చకులు తులసి వెంకటరమణాచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు హేమంత్ కుమార్, వి. రవీంద్ర రెడ్డి, వి.ఆగొండ చారి, సురేష్ కుమార్ సింగ్, ఎం. శ్రీకాంత్, కె.సంజయ్ కుమార్, వి. సురేష్ కుమార్ సింగ్, రత్నాకర్ రావ్, భక్తులు గాంధీ, సూర్యకు మారి, రత్నమాల, రత్నమాణిక్యం, లక్ష్మీ నరసింహ, కొండ లలిత, దశిక గాయత్రి, అనురాధ, కెవిఎస్ ప్రసాద్, సుబ్బారావు, జిడి సంపత్, నాగరాజ్, కె.నాగేశ్వరరావు, గిరీష్, పద్మావతి, మహాలక్ష్మీ, పద్మజ, రాణి తదితరులు పాల్గొన్నారు.

# అమీర్‌పేట్ మైత్రివనం ఏరియాలో ముంపుకు గురికాకుండా చేపట్టాల్సిన చర్యలు

## జిహెచ్ఎంసి హైడ్రా కమిషనర్ల ఆధ్వర్యంలో సమాలోచనలు



హైదరాబాద్, మేజర్ న్యూస్ (సిటీ ప్రతినిధి): అమీర్ పేట్, మైత్రి వనం ఏరియాలు ముంపుకు గురికాకుండా చేపట్టాల్సిన చర్యలపై జీహెచ్ఎంసీ, హైడ్రా సంయుక్తంగా సమాలోచనలు చేస్తుంది.ఇప్పటికే పలు మార్లు జీహెచ్ఎంసీ, హైడ్రా వేర్వేరుగా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. వరద ముంపు సమస్యలు ఉత్పన్నం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు.
గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్,హైడ్రా కమిషనర్ ఎ వి రంగనాథ్ సంయుక్తంగా జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, సాంకేతిక కన్సల్టెంట్ లతో కలసి అమీర్ పేట్, మైత్రి వనం ఏరియాల్లో పర్యటించారు.అమీర్ పేట్ , మైత్రి వనం పరిసరాల్లో వరద కాలువలకు ఉన్న ఆటంకాలను జీహెచ్ఎంసీ ,హైడ్రా కమిషనర్ లు ఇరువురు పరిశీలించారు. అమీర్ పేట మెట్రో స్టేషన్ , మైత్రి వనం దగ్గర వరద ఉధృతిని శాశ్వతంగా కట్టడి చేయడానికి ఉన్న అవకాశాలను క్షేత్ర స్థాయిలో కసరత్తులు చేశారు.
జూబ్లీ హిల్స్, వెంకటగిరి, రహ్మత్ నగర్, యూసఫ్ గూడ, ప్రాంతాల నుంచి కృష్ణ కాంత్ పార్క్ మీదుగా పారే కాలువ గాయత్రి నగర్ వద్ద ఉన్న నాలాలో కలుస్తుంది. ఈ ప్రాంతాలతో పాటు ఇటివలే మధురానగర్, శ్రీనివాస్ నగర్ వెస్ట్ నుంచి భారీగా వరద రావడంతో రోడ్డు మొత్తం మునిగిపోయింది.
అమీర్ పేట మెట్రో, మైత్రివనం ప్రాంతం వరద నీటితో నిండిపోయింది.
40 అడుగుల వెడల్పుతో పై నుంచి వచ్చిన వరద కాలువలు అమీర్ పేట, ఎస్ఆర్ నగర్ మెయిన్ రోడ్డు దాటే సమయంలో 10 అడుగులకు కుంచించుకుపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.కుచించుకుపోయిన నాలా వెడల్పు చేయడంతో పాటు భవిష్యత్తులో ముంపు సమస్యలు పునరావృతం కాకుండా చూసేందుకు వీలుగా డ్రైన్ రీ %-% మోడలింగ్ ( నాలా పునర్నిర్మాణం) కు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

## గణేష్ ఉత్సవాలకు అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి : జోనల్ కమిషనర్ హేమంత్ బోరడే




శేరిలింగంపల్లి,మేజర్ న్యూస్ : గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని జోనల్ కమిషనర్ హేమంత్ బోర?డే పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ముందస్తు పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలని ఎటువంటి పొరపాట్లు అసౌకర్యాలకు తావు లేకుండా చూడాలని ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో,జోనల్ కి సంబంధించిన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమీషనర్ సహా పలు విభాగాలకు చెందిన అధికారులతో కలిసి గణేష్ ప్రిపరేడెన్స్ సమావేశం నిర్వహించి మల్కం చెరువు, గోపి చెరువు, నల్లగండ్ల చెరువు, రాయసముద్రం చెరువు, సాకి చెరువు, గంగారం చెరువు, గౌతమ్ బేబీ పాండ్, కడియం కుంట, దుర్గం చెరువుతోపాటు ప్రధాన ,అంతర్గత రహదారులను శుభ్రపరచాలి ఆయా విభాగాల నడుమ ఎటువంటి సమన్వయ లోపం లేకుండా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని, ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణను అత్యంత పకడ్బందీగా చేపట్టాలన్నారు. వినాయక ప్రతిమల నిమజ్జనానికి బేబీ పాండ్లకు సిద్ధం చేయాలని, వాటిల్లో పేరుకుపోయిన వ్యర్థాలను ముందస్తుగా తొలగించి సంసిద్ధం చేయాలని సూచించారు. శోభాయాత్ర జరిగే ప్రాంతాల్లో రహదారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని, పాండ్ల వద్ద విద్యుత్ దీపాలు, సానిటేషన్ సహా అనుబంధ అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. చెరువుల పరిరక్షణకు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని, డెంగ్యూ కేసులు గుర్తించబడిన ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపట్టాలని ఎంటమాలజీ విభాగాన్ని ఆదేశించారు. సీఎస్ఆర్ కింద పచ్చదనం, పార్కుల నిర్వహణకు చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీలు, ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం , పట్టణ ప్రణాళిక, ఎంటమాలజీ విభాగాలతో పాటు ఆయా విభాగాల అధికారులు గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్ ,సభ్యులు తదితరులు ఉన్నారు.

# రాష్ట్రం దేశం గర్వించదగ్గ పతకాలు సాధించాలి

**- క్రీడాకారుల సన్మానించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**

**- పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2025 విజయవంతం**



ఎల్బీనగర్, మేజర్ న్యూస్ ప్రతినిధి: రాబోయే రోజుల్లో రాష్ట్రం, దేశం గర్వించదగ్గ ,మంచి పతకాలు సాధించాలి అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2025 ఆగస్ట్ 6న గచ్చిబౌలి అథ్లెటిక్స్ స్టేడియంలో ఘనంగా ముగిసింది. జూనియర్ సబ్-జూనియర్ విభాగాల్లో రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన 200కి పైగా అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా నుండి ప్రాతినిధ్యం వాహించిన దివ్య,శిరీష ధనావత్ యశ్వంత్ పతకాల పంట పండించారు. దివ్య టి47 క్యాటగిరి 100 మీటర్ పరుగు,200 మీటర్ పరుగు స్వర్ణ పతకం సాధించింది. శిరీష ఎఫ్40 క్యాటగిరిలో షార్ట్ పుట్ జావలిన్ విభాగంలో స్వర్ణ పతకం అందుకుంది. ధనావత్ యశ్వంత్ 400 మీటర్ లాంగ్ జంప్ విభాగంలో స్వర్ణ పతకంలో మెరిశాడు. వీరందరిని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. వీరు ముగ్గురు హయత్ నగర్ సాయి చైతన్య మోడల్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నారు. వీరికి సాయి చైతన్య స్కూల్ ఉచిత విద్య అందిస్తుంది. అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ లో శిక్షణ పొందుతున్న వీరు ఈనెల 29 నుండి 31 తేదీ వరకు మధ్యప్రదేశ్ లో నిర్వహిస్తున్న పారా నేషనల్ అథ్లెటిక్ ఛాంపియన్షిప్ 2025 అర్హత సాధించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, క్రీడాకారులకు నా మద్దతు ఎప్పుడు ఉంటుందని తెలిపారు. కోచ్ వినోద్ కుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు బానోత్ దేవరం నాయక్, పల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన నాంపల్లి తహసిల్దార్ మహ్మద్ నయీముద్దీన్

సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః
నాంపల్లి ఏమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌ను గురువారం నాంపల్లి మండల తహసిల్దార్ మహ్మద్ నయీముద్దీన్ మర్యాద పూర్వకంగాకల్సి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశ్విన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సామూహిక శ్రీమంతాలు



ఉప్పల్, మేజర్‌న్యూస్ : వారాహి సేల్స్ అండ్ వి బి జే ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 108 మంది గర్భిణీ స్త్రీలకు మల్లాపూర్ అంబేద్కర్ భవన్‌లో శ్రీమంతాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, మీర్పేట్ ఎస్‌బి కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్‌లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విబీజే ఫౌండేషన్ రాజు, సత్యవతి ప్రసన్న,మణిదీప్,స్పందన అల్వాల్ ప్రాజెక్టు సిడిపిఓ స్వాతి , సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

# మియాపూర్‌లో విషాదం...

**మక్త మహబూబ్పేట్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అనుమానాస్పద మృతి**



మియాపూర్,మేజర్ న్యూస్ : హైదరాబాద్ మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. మక్త మహబూబ్పేట్ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారు కావడంతో స్థానికుల్లో తీవ్ర విషాదం నింపింది. స్థానికుల ఫిర్యాదుతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతుల్లో అత్త, మామ, భార్య, భర్త, రెండేళ్ల చిన్నారి ఉన్నారని గుర్తించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతుల్లో ఉప్పరి లక్ష్మయ్య(60), అతని భార్య ఉప్పరి వెంకటమ్మ(55), అల్లుడు అనిల్(32), కుమార్తె కవిత(24), రెండేళ్ల చిన్నారి ఉన్నారు. మృతులంతా కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా సేడం మండలం రంజోలి వాసులుగా గుర్తించారు. వీరంతా ఒకే ఇంట్లో మృతి చెందడంతో ఇది ఆత్మహత్యా లేక హత్యా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఘటనపై సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు, క్లూస్ టీంతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి, ఆధారాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టు మార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి గల కారణాలు స్పష్టంగా తెలుస్తాయని పోలీసులు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగిస్తున్నామన్నారు. అలాగే ఆ ప్రాం తంలో ఉన్న స్థానికులను, బంధువులను విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుల కుటుంబ నేపథ్యం, వారికి ఏవైనా సమస్యలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు ఆరా తీస్తున్నారు.

సూర్య
www.suryaa.com
హెల్పర్స్ కావలెను
ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్ మెషన్ సెక్షన్‌లో
పనిచేయుటకు హెల్పర్స్ కావలెను
ఆసక్తి గల అభ్యర్థులు
9494662279 / 7382070613
నంబర్లను సంప్రదించగలరు.
సూర్య కార్యాలయం
Surya Soudha, Plot No.185, Siddi Vinayaka Nagar,
Opp: Hi-Tech City, Near YSR Statue, 100 Ft. Road,
Madhapur, Hyderabad - 500 072

# పెండింగ్ పనులను పూర్తి చేయించండి

**-డీఎంసీని కోరిన మధురానగర్ సంక్షేమ సమితి నేతలు**



వెంగళరావునగర్, మేజర్‌న్యూస్: తమ కాలనీలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను పూర్తి చేయించాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 డిప్యూటీ కమిషనర్ రజినీకాంత్ రెడ్డిని మధురానగర్ కాలనీ నేతలు కోరారు. ఈ మేరకు మధురానగర్ సంక్షేమ సమితి నేతలు గురువారం డీఎంసీని సర్కిల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారు డీఎంసీతో మాట్లాడుతూ తమ కాలనీలో సీసీ రోడ్లు తదితర ముఖ్యమైన పనుల విషయంలో చొరవ తీసుకుని వీలైనంత త్వరలో పనులు పూర్తి చేయించాలని కోరారు. దీనికి డీఎంసీ స్పందిస్తూ పెండింగ్ పనుల విషయాన్ని తాను పరిశీలించి వాటి విషయంలో చర్య తీసుకుంటానని తెలిపారని సంక్షేమ సమితి నేతలు తెలిపారు. డీఎంసీని కలిసిన వారిలో మధురానగర్ సంక్షేమ సమితి ఉపాధ్యక్షులు ఎన్.వి.మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి కోడే సాంబశివరావు, జాయింట్ సెక్రటరీ హనుమంతరావు, కోశాధికారి కె.సుగుణ తదితరులున్నారు.

## బీజేపీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా గంగుల రాధాకృష్ణ యాదవ్



మాదాపూర్,మేజర్ న్యూస్ : రంగారెడ్డి జిల్లా బిజెపి పార్టీ వైస్ ప్రెసిడెంట్ ఉపాధ్యక్షులుగా శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన గంగుల రాధాకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలను అప్పగించిన అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి గారికి, రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావుకి ప్రత్యేకంగ కృతజ్ఞతలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా అర్బన్ లో పార్టీ అభివృద్ధి కోసం సాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.భారతీయ జనతా పార్టీ ఎప్పటినుండీ ప్రజల కోసం, దేశం కోసం, జాతి కోసం పోరాటం చేస్తూనే ఉంది. మన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో దేశం కొత్త దిశగా ముందుకు సాగుతోంది. అదే మార్గంలో మన జిల్లా, మన పట్టణం అభివృద్ధి చెందేలా నేను కృషి చేస్తాను.ప్రతీ ఒక్కరిని కలుపుకుంటూ ఎటువంటి తరతమ్యాలు చూపకుండా ముందుకు నడిచే విధంగా సమన్యాయం పాటిస్తానని హామీ ఇచ్చారు.

## బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రవీందర్ యాదవ్



చందనాగర్మా, మేజర్ న్యూస్ : టూరిజం కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ కు శేరిలింగంపల్లి యువ నేత, బీ ఆర్ ఎస్ పార్టీ సీనియర్ లీడర్ రవీందర్ యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సహచర తెలంగాణ విద్యార్థి నేతలు తుంగ బాలు, ఆంజనేయులు, విద్యార్థి సంఘం నేతలతో పాటు హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి హార్ధిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా శాలువాతో సత్కరించి విష్ చేశారు. రానున్న రోజుల్లో మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాక్షించారు. తెలంగాణ ఉద్యమంలో ముందుండి కొట్లాడిన ఘటనలు గుర్తు చేసుకున్నారు. కెసిఆర్ బాటలో ఉద్యమ స్పూర్తితో కాంగ్రెస్ సర్కార్ పై అలుపెరగని పోరాటం చేస్తున్నారు అని గెల్లు శ్రీనివాస్ ను రవీందర్ యాదవ్ కొనియాడారు. రానున్న రోజుల్లో మరిన్ని బలమైన పోరాటాలు చేసేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారు అని రవీందర్ యాదవ్ వెల్లడించారు. ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వంత్.. నాయకులు కార్తీక్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో ట్రాఫిక్ పెట్రోలింగ్ బైక్-ట్రాఫిక్ మార్షల్‌లను ప్రారంభించిన నగర పోలీస్ కమీషనర్ సి.వి. ఆనంద్






సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ నిర్వహణను పటిష్టం చేసేందుకుగాను నగర పోలీస్ కమీషనర్ సి.వి. ఆనంద్ గురువారం 50 ట్రాఫిక్ పెట్రోలింగ్ బైక్‌లను,100 ట్రాఫిక్ మార్షల్‌లను లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సెక్రెటరి జనరల్ శేఖర్‌రెడ్డి, నగర అదనపు సి.పి. విక్రంసింగ్ మాన్, జాయింట్ సెక్రెటరి రాజశేఖర్‌రెడ్డి, ట్రాఫిక్ జాయింట్ కమీషనర్ జోయల్ డేవీత్‌తోపాటు పలువురు ప్రముఖులు,ట్రాఫిక్ పోలీసు అధికారులు పాల్గొన్నారు. అనంతరం సి.పి. సి.వి. ఆనంద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపడుతున్నామని, దీనిద్వారా పోలీసులు,పౌర సమాజం కల్సి హైదరాబాద్‌లో మెరుగైన ట్రాఫిక్ నియంత్రణ,వాహనాలు సులభంగా రాకపోకలు కొనసాగించేందుకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. నగరంలో ట్రాఫిక్ నిర్వహణను బలోపేతం చేసేందుకుగాను హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ కీలక చర్యలు తీసుకుందని, అందులో భాగంగా 50 కొత్త ట్రాఫిక్ పెట్రోలింగ్ బైక్‌లను,100 మంది ట్రాఫిక్ మార్షల్‌లను ప్రారంభించామన్నారు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా హైదరాబాద్ ట్రాఫిక్ విభాగంలో ట్రాన్స్‌జెండర్లను నియమించామని, ఇది వారికి ఉపాధికల్పనకు ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయంఅని ఆయన చెప్పారు.

## మెట్రోపాలిటన్ సిటీకి మణిహారం గణేష్ ఉత్సవాలు





హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : ఈస్ట్ జోన్ పరిధిలో వినాయక మండపాలు నిర్వహించే కమిటీల వారితో పోలీసు ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. గురువారం కింగ్ కోఠి, ఈడెన్ గార్డెన్ లో జరిగిన ఈ సమావేశానికి ఈస్ట్ జోన్ డిసిపి ఐపీఎస్ బాలస్వామి, అడిషనల్ డిప్యూటీ సి పి నరసింహ, నాలుగు డివిజన్ల ఏసీపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐపీఎస్ బాలస్వామి మండప నిర్వాహకులకు , జిహెచ్‌ఎంసి అధికారులకు సూచనలు చేశారు. మెట్రోపాలిటన్ సిటీ కి మణిహారంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు దశాబ్దాలుగా నిలుస్తున్నాయని గుర్తు చేశారు.శాంతియుత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు జరిగేలా చూడాలని కోరారు. మండప నిర్వాహకులు ఐక్యమత్యంతో అన్ని వర్గాల ప్రజలను కలుపుకుపోతూ ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. విగ్రహ కమిటీలకు ఎలక్ట్రిసిటీ, జిహెచ్‌ఎంసి, వాటర్ బోర్డ్, ఆర్ అండ్ బి, శానిటేషన్ అధికారులు నిత్యం అందుబాటులో ఉండాలని తెలిపారు. అవసరమైతే తమ సేవలను పండగ సందర్భంగా అదనంగా అందించేందుకు సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ అధికారులు 24 గంటలు మండపాల వద్ద వాహనాల రద్దీ లేకుండా చూడాలని ప్రత్యేకంగా సూచించారు. అందరం కలిసికట్టుగా ఈ నవరాత్రులను విజయవంతంగా ముగించుకొని నగరాన్ని ప్రగతి పథంలో మరింతగా ముందుకు తీసుకెళ్దామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాలుగు డివిజన్లకు చెందిన ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు ,ఇతర సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# సింక్రోని గ్లోబల్ ఐటీ సొల్యూషన్స్‌కి ప్రతిష్టాత్మక అవార్డు




హైదరాబాద్, మేజర్ న్యూస్: సింక్రోని గ్లోబల్ ఐటీ సొల్యూషన్స్ సంస్థ, వ్యవస్థాపకుడు %డ% సీఈఓ శ్రీ భాను ప్రసాద్ కొంగల గారి నాయకత్వంలో, "బెస్ట్ ఇన్నోవేటివ్ %ూ×% సొల్యూషన్స్ ఇన్ ఎడ్టెక్ ఎక్సలెన్స్" అవార్డును అందుకుంది. ఈ అవార్డు 2025లో హైదరాబాద్‌లో జరిగిన 11వ ఎడ్యుకేషన్ లీడర్స్ కాన్‌క్లేవ్ %డ% అవార్డ్స్ లో ప్రదానం చేశారు. ఐసీఫై గ్రూప్, అనురాగ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో విద్యా రంగానికి చెందిన ప్రముఖులు, మార్గదర్శకులు, ఇన్నోవేటర్స్ పాల్గొన్నారు. %ఖూ% యూనివర్సిటీ ప్రో-చాన్సలర్ డాక్టర్ కె.ఎస్. జగన్నాథ్ రావు గారి చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం జరిగింది ఈ సందర్భంగా శ్రీ భాను ప్రసాద్ కొంగల మాట్లాడుతూ "ఈ అవార్డు మా టెక్నాలజీ ఇన్నోవేషన్స్‌కే కాకుండా, %ూ×% ఆధారిత విద్యా పరిష్కారాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా విద్యను మార్పు తేవాలనే మా లక్ష్యానికి ఇచ్చిన గుర్తింపు. ఇది మాకు మరింత ప్రేరణనిస్తుంది" అని తెలిపారు.

# మిలాదున్నబీ, గణేష్ ఉత్సవాల సందర్భంగా బంజారాహిల్స్‌లో పీస్ కమిటీ సమావేశం



సోమాజిగూడ/మేజర్ న్యూస్: మిలాదున్నబీ, గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతి భద్రతల మధ్య జరపడానికి బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బంజారాహిల్స్ ఏసిపి సామల వేంకట రెడ్డి ,జారాహిల్స్ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర , జూబ్లీహిల్స్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర రెడ్డి , ఫిలింనగర్ ఇన్స్పెక్టర్ సంతోషం , మసాబ్‌ట్యాంక్ ఇన్స్పెక్టర్ పోలీస్ స్టేషన్ల ఇన్స్పెక్టర్లు పాల్గొని, ఉత్సవాల సమయంలో చట్టవ్యవస్థ కాపాడటానికి అనుసరించాల్సిన మార్గదర్శకాలను సమాజ పెద్దలు, సంఘాల ప్రతినిధులతో పంచుకున్నారు.అధికారులు మాట్లాడుతూ...గణేష్ మండపాల ఏర్పాటులో ట్రాఫిక్‌కు ఇబ్బందులు రాకుండా చూడాలని,మిలాదున్నబీ జూలూస్ మరియు గణేష్ విగ్రహాల నిమజ్జనం సమయాల్లో శాంతి భద్రతల కోసం పరస్పర సహకారం అవసరమని,శబ్ద మోత, లైటింగ్, మద్యం సేవించడం వంటి అంశాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.పోలీస్ అధికారులు స్థానిక మత పెద్దలు, కమ్యూనిటీ ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులను శాంతి, సామరస్య వాతావరణం కొనసాగించేలా పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో స్థానిక మత పెద్దలు, గణేష్ మండప నిర్వాహకులు, మసీదు కమిటీ ప్రతినిధులు, కాలనీ సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాదులో వినాయక ఉత్సవాల కోసం గణేష్ విగ్రహా ల ఆగమనం ఈవెంట్స్



సోమాజిగూడ/మేజర్ న్యూస్:హైదరాబాద్లో గణేష్ పండుగ సందడి మొదలైంది. నగర వ్యాప్తంగా గణేష్ మండపాలను నిర్మిస్తున్నారు. మరోవైపు భారీ గణనాథులను ఆగమనం పేరుతో గ్రాండ్ గా మండపాలకు తీసుకొస్తున్నారు మండప నిర్వాహకులు. హైదరాబాద్‌లోని మూస్రాంబాగ్ %జీకూ% అసోసియేషన్ నిర్వహకుల 22 ఫీట్ల గణేష్ విగ్రహాన్ని గ్రాండ్ సెలబ్రేషన్స్ తో మండపానికి తరలించారు. ప్రతి ఏటా విభిన్న ఆకృతుల్లో అందమైన గణేష్ విగ్రహాలను నిలబెడు తున్నారు మందప నిర్వాహకులు. ఈ ఏడాది కూడా భారీ గణనాథుడు ఆగమనం కార్యక్రమాన్ని గ్రాండ్ గా నిర్వహించారు. గత 20 సంవత్సరాలుగా గణేష్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గణేశుడి రాక, గణేశోత్సవ వేడుకలలో మహారాష్ట్ర బ్యాండ్ ఆట పాటల , భారీ కలర్ ఫుల్ ఫైర్ క్రా కర్స్ కాలుస్తూ అగమన కార్యక్రమం నిర్వహించారు. గత రెండు మూడేళ్లు కొన్ని ఏళ్లుగా గణేష్ నిమజ్జనం కాకుండా, ఆగమనం కార్యక్రమాలను భారీ సేటప్స్ తో అటపట ల నడుమ మండపాలకి తీసుకొస్తున్న ట్రెండ్ అందరినీ ఆకట్టుకుంది.